భవిష్యత్ ప్రజాపాలన
మా వార్త రేపటి భవిష్యత్‌కు నిదర్శనం
bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in
తెలుగు దినపత్రిక
ASN NEWS
ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి తెలంగాణ - రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 210 శనివారం , ఆగస్టు 29, 2026 , పేజీలు - 12 వెల : 1 /-

## ముఖ్యమంత్రికి రాఖీలు కట్టిన
# మహిళా మంత్రులు

**వివాదాల తరవాత తొలిసారి సిఎం ఇంటికి కొండా సురేఖ**

**సిఎంకు ఆడబిడ్డల ఆశీర్వాదాలు ఉండాలని వ్యాఖ్య**

**సిఎంకు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు, మహిళా కానిస్టేబుల్స్**







**హైదరాబాద్,ఆగస్టు28 :** రక్షా బంధన్ సందర్భంగా అపూర్వ సన్నివేశం ఆవిష్కృతం అయ్యింది.మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి రేవంత్‌కు రాఖీ కట్టారు. సిఎం కుటుంబ సభ్యులు సమక్షంలో వీరిద్దరు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. పరకాల వివాదం తర్వాత కొండా సురేఖ.. సీఎం నివాసానికి వెళ్లడం ఇదే తొలిసారి. సీఎంతో భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లి పోయారు. సీఎం రేవంత్‌రెడ్డికి బంగారు రాఖీ కట్టిన తర్వాత.. ఆమె నివాసంలో కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి మూడోసారి రాఖీ కట్టా. నేను అందరికీ సోదరినే. పండుగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయను. ముఖ్యమంత్రికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి ఆయనకు ఇవ్వాలని దేవుడిని కోరుకున్నా. ఆడబిడ్డల ఆశీర్వాదాలు సీఎంకు ఎప్పుడూ ఉండాలని కోరుకున్నానని తెలిపారు. ఇటీవల.. ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అయితే మిగతా2లో...

## అర్హులందరికీ ఇళ్లు కేటాయిస్తాం

**- లక్కీడ్రా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్,ఆగస్టు28 :** క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లలో ప్లాట్లను లాటరీ ద్వారా లబ్ధిదారులకు కేటాయిస్తున్నారు. మొదటి దఫాలో 7,350 ఇందిరమ్మ ఇళ్లను అర్హు లకు అందించనున్న ప్రభుత్వం కుత్బుల్లా పూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియో జకవర్గాల్లో లక్కీ డ్రా నిర్వహించింది. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలోని మిగతా2లో...

## గవర్నర్‌ను పరామర్శించిన భట్టి

**- ఆరోగ్యంపై ఆరా తీసిన సిఎస్ సంజయ్ జాజు**



**హైదరాబాద్,28 :** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. గుండె సంబ ంధిత సమస్యతో అనారోగ్యానికి గుర్తై ఆస్ప త్రిలో చికిత్స పొందిన మిగతా2లో...

## 2047 నాటికి 50 శాతం
# పచ్చదనమే లక్ష్యం

**- ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా నాగబాబు బాధ్యతల స్వీకరణ**

- **పర్యావరణ పరిరక్షణలో ప్రజలనూ భాగస్వాములను చేస్తాం**
- **మొక్కలు నాటడమే కాదు.. వాటి మనుగడకూ ప్రత్యేక దృష్టి**
- **అన్ని శాఖలనీ సమన్వయం చేసుకొని లక్ష్యాలను సాధిస్తాం**




**మంగళగిరి,ఆగస్టు28 :** ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా నాగబాబు బాధ్యతలు స్వీకరణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అటవీ, వృక్ష సంపదను విస్తరించి 2047 నాటికి మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే మహోద్యమంగా తీర్చిదిద్దేం దుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. "ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో గౌరవంగా, బాధ్యతగా భావిస్తున్నాను. తనపై నమ్మకం మిగతా2లో...

## పొంచి ఉన్న
# మరో వరద ముప్పు

**- నేపాల్‌లో 547కు చేరిన మృతులు**



2లో



# సెప్టెంబర్ 2 నుంచి బీఆర్ఎస్ పోరుబాట

**వారం రోజుల పాటు కాంగ్రెస్ మోసంపై ప్రచారం**

**పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు**

**హైదరాబాద్,ఆగస్టు28 :** కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల అసమర్థ పాలనపై సెప్టెంబర్ 2నుంచి వారం రోజుల పాటు బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటను విజయ వంతం చేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నుంచి పార్టీ సీనియర్ నేతలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యు లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సెప్టెంబర్ 2న ఆరు గ్యారెంటీల వైఫల్యంపై నియోజకవర్గ మిగతా2లో...

## బంగారం మైనింగ్‌లో హట్టి- సింగరేణి
# జతకట్టాలి

**● భవిష్యత్తు ప్రాజెక్టుల్లో కలిసి పనిచేయాలి ● సింగరేణి అధికారులకు భట్టి విక్రమార్క దిశా నిర్దేశం ● హట్టి, యుటీ బంగారు గనులలో భట్టి విస్తృత పర్యటన**




**హైదరాబాద్,ఆగస్టు28 :** బంగారం మైనింగ్‌లో విశేష అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో సింగరేణి కలిసి పనిచేసేలా జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలిం చాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కర్ణాటక గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటి బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. బంగారు ఖనిజం తవ్వకం నుంచి శుద్ధ బంగా రం తయారీ వరకు చేపడుతున్న పక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు. మిగతా2లో...

## పెనం మీది నుంచి పొయ్యిలో
# పడ్డట్లు అయ్యింది

**కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు ప్రజల్లో బాధ**

**రేషన్ కార్డులపై మోడీ ఫోటో ఎందుకు వేయరు**

**సిఎస్ సంజయ్ జాజుతో పలు అంశాలపై చర్చించిన ఈటెల**



**హైదరాబాద్,ఆగస్టు28 :** తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లుగా తయారయ్యిందని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కెసిఆర్‌ను కాదని ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అంతకు మించి అన్నట్లుగా అవినీతి పాలన సాగుతోందని మండిపడ్డారు. తెలంగాణలో కేసీఆర్ పాలనలాగానే.. రేవంత్ రెడ్డి పాలన కూడా తయారయ్యిందని ఈటల రాజేందర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనతో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని మిగతా2లో...

## పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య
# ప్రమాణాలు తప్పనిసరి

**నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానంపై ఆరా తీయాలి**

**నేర నయింత్రణలో సాంకేతకితకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి**

**తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశం**




**హైదరాబాద్,28 :** నేరాల దర్యాప్తు, పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశిం చారు. నేరాల సమీక్షను కేవలం గణాం కాలకే పరిమితం చేయకుండా.. ప్రతి నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధా నం, దర్యాప్తు తీరు, ఆయా కేసుల పరిష్కారాన్ని సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. అన్ని యూనిట్ల పోలీసు ఉన్నతాధికారులతో శుక్రవారం డీజీపీ కార్యాలయంలో అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని యూనిట్ల పోలీసు అధికారులకు పలు కీలక అంశాలపై డీజీపీ దిశా నిర్దేశం చేశారు. సాంకేతికతను నేర నియంత్ర ణకు సాధనంగా వినియోగించాలని డీజీపీ సూచించారు. సైబర్, ఆర్థిక నేరాలు తగ్గాయని మిగతా2లో...

# 2047 నాటికి 50 శాతం పచ్చదనమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఉంచి ఈ కీలక బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు. ఏపీ గ్రీన్ సొసైటీ నిర్దేశించుకున్న లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తాను. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాల సాధనకు ఏపీ గ్రీన్ ద్వారా కృషి చేస్తాను. పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యం ప్రస్తుతం రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 22.96 శాతంగా ఉంది. రాబోయే 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, వృక్ష సంపదను కలిపి పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే మా ప్రధాన లక్ష్యం. ఇది కేవలం గణాంకాల కోసం పెట్టుకున్న లక్ష్యం కాదు. భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణం, మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వాతావరణ మార్పులు ప్రపంచానికి సవాలుగా మారుతున్న ఈ సమయంలో పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యత. అందుకే ఏపీ-గ్రీన్ కార్యక్రమాన్ని కేవలం అడవులకే పరిమితం చేయకుండా, రాష్ట్రంలోని ప్రతి అనుకూలమైన ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచేలా కార్యాచరణ చేపడుతున్నాము. వ్యవసాయ భూములు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలు, ప్రధాన రహదారుల ఇరువైపులా, కాలువ గట్లు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రాంగణాలు, పరిశ్రమల పరిసరాలు, అనుకూలమైన బంజరు భూములు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తాం. పెద్ద ఎత్తున మొక్కల పెంపకం, తోటల అభివృద్ధిని ప్రోత్సహిస్తాం. ఈ బృహత్తర లక్ష్యం విజయం కావాలంటే ఒక్క శాఖతో సాధ్యమయ్యేది కాదు. వ్యవసాయం, ఉద్యానవనం, పంచాయతీరాజ్, విద్య, పరిశ్రమలు, రెవెన్యూ, జలవనరులు, రవాణా, అటవీ శాఖలతోపాటు అన్ని సంబంధిత ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాం. ఏపీ గ్రీన్ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా మాత్రమే ఉండకూడదు. రైతులు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత సంస్థలు, విద్యార్థులు, యువత, పారిశ్రామికవేత్తలు, ప్రతి పౌరుడిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలనుకుంటున్నాం. ఏపీ-గ్రీన్‌ను ఒక ప్రభుత్వ పథకంగా కాకుండా, ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే గొప్ప ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. మొక్కలు నాటడం మాత్రమే మా లక్ష్యం కాదు. నాటిన మొక్కలను బతికించడం, వాటిని సంరక్షించడం, అవి ఆరోగ్యంగా ఎదిగేలా చూడటమే అసలైన బాధ్యత. నాటిన ప్రతి మొక్క మనుగడపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. వాటి సంరక్షణ, నిర్వహణ కోసం ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తాం" అన్నారు.

# బంగారం మైనింగ్‌లో హట్టి- సింగరేణి జతకట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో అపార అనుభవం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని హట్టి అనుభవంతో జోడించాలని సూచించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతికత వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ తదితర అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయంగా అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలన్నారు. బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి-సింగరేణి భాగస్వామ్య ంతో బంగారం ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పనతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని తెలిపారు. హట్టి గోల్డ్ మైన్స్‌లోని ప్రొడక్షన్ యూనిట్, ఖనిజ శుద్ధి కేంద్రం, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి శుద్ధ బంగారంగా మార్చే విధానాన్ని అధికారులు వివరించారు. హట్టి ప్రాజెక్టు ద్వారా రోజుకు సగటున రెండు నుంచి నాలుగు కిలోల బంగారం ఉత్పత్తి అవుతోందని అధికారులు తెలిపారు. యూటి ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్' వ్యూ పాయింట్ వద్ద నిలబడి బంగారం ముడి మట్టిని వెలికి తీసిన ప్రక్రియను, సేకరించిన ప్రదేశాలను ఆయన ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా ఓపెన్ కాస్ట్ గనిలో ఎంత లోతు నుంచి బంగారం తయారీకి కావలసిన ముడి సరుకును తీశారనే వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంగారం ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను లోతుగా పరిశీలించారు. బంగారు ఖనిజ అన్వేషణకు ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తారని అధికారులను అడిగారు. అక్కడి అధికారులు డిప్యూటీ సీఎంతో మొక్కను నాటించారు. అనంతరం యుటీ భూగర్భ గనిలో జరుగుతున్న బంగారు ఖనిజ తవ్వకాలను పరిశీలిం చారు.

భూగర్భ గనిలో ఖనిజం తవ్వకం, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తదితర అంశాలను ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ, యెమ్మూరప్ప గౌడ, రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్

# పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లు అయ్యింది

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. శుక్రవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఎంపీ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. అనంతరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఐదు కిలోల సన్న బియ్యం ప్రజలకు ఇస్తున్నా.. ప్రధాని మోదీ పోటో వేయడం లేదని మండిపడ్డారు. ఎవరి జాగీరని మీ ఫొటోలు వేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం ఇచ్చేది కేంద్రమైతే మీ బొమ్మలెందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. యూఎస్, యూరప్ వెళ్లి.. భారత్‌లో మత కల్లోలాలు జరుగుతున్నాయని అంటారని విమర్శించారు. లుంబిని పార్క్, గోకుల్ చాట్ వద్ద ఎవరి హయాంలో బాంబులు పేలాయని కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్.. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి మీ ఆశీర్వాదంతోపాటు మీ మద్దతు కావాలంటారని వ్యంగ్యంగా అంటారని తెలిపారు. ఇక్కడికి వచ్చి అదే సీఎం రేవంత్.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పిస్తారని పేర్కొన్నారు. మోదీ దేశానికి ప్రధాని కాబట్టే రాష్ట్రానికి ఇన్ని రహదారులు, రైల్వే అభివృద్ధికి నిధులు వచ్చాయని ఎంపీ ఈటల వివరించారు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశాల అభివృద్ధి ఉందని మోదీ అంటారని గుర్తు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మాకెంటి ఇచ్చేదని అన్నారన్నారు. అలాగే ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. అసలు దేశ ప్రధాని మోదీని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేర్ చేయలేదన్నారు. అలా చేయడం రాష్ట్రాలకు మంచిది కాదని.. అరిష్టమని ఆయన తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలు వేసి పార్టీ నాయకులకు కేటాయించుకుంటున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ విమర్శించారు. మీ తాత జాగీరు కాదు అలా చేయడానికి అంటూ కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. ఇందిరమ్మ ఇళ్లపై కేంద్రానికి ఎలాంటి వివక్షత లేదన్నారు. మూడు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దాని కంటే రూ.100 కోట్లు అధికంగా కేంద్రం ఇచ్చిందన్నారు. మెట్రో ఫేజ్ -1, ఫేజ్ -2 కు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్ట పక్కల గ్రామాలను కూడా కలిపారని చెప్పారు. కానీ వాటిని పట్టించుకోవట్లేదని విమర్శించారని ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ఓబీ), రైలు అండర్ బ్రిడ్జ (ఆర్‌యూబీ) సదుపాయం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటి నిర్మాణం చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. కేంద్రం సహకరిస్తుందని.. కానీ రూపాయి ఇవ్వక పోయినా రాష్ట్ర ప్రభుత్వం సహకారం కావాలని కేంద్ర మంత్రి వివరించారని ఎంపీ ఈటల ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ అంశంపై తెలంగాణ సీఎస్‌ను కలిసి మాట్లాడానని రేవంత్ తెలిపారు. హైదరాబాద్‌లో అర్బన్, రూరల్ హౌసింగ్ స్కీం పనులు వేగంగా చేయాలని సీఎస్‌ను కోరినట్లు ఎంపీ ఈటల వివరించారు. రైల్వే పెద్ద టెండర్లలో పాల్గొని నగదు తీసుకుంటున్నారని.. కానీ చిన్న చిన్న టెండరల్లో పాల్గొనట్లేదంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీని వల్ల అభివృద్ధి కావడం లేదన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్లకు అమృత్ పథకంలో భాగంగా రూ.22 కోట్లు కేంద్రం ఇస్తుందని అన్నారు. అన్ని రైల్వేస్టేషన్లు ఫేస్ లిఫ్టింగ్ చేయడానికి కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. మేడ్చల్, సికింద్రాబాద్ పరిధిలో గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణం జరుగుతోందని అన్నారు.

# పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలు తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టిసారించామని వెల్లడించారు. ఆయా యూనిట్ల వారీగా నెలవారీ సమీక్షలు తప్పనిసరని స్పష్టం చేశారు. బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని మార్గనిర్దేశర చేశారు. ఇటీవల సీసీటీఎన్ఎస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో గతంలో 70 నుంచి 80 శాతంగా ఉన్న.. సీసీటీఎన్ఎస్ డేటా అప్‌డేట్.. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో 96 శాతానికి చేరడం అభినందనీ యమని డీజీపీ పేర్కొన్నారు. ప్రతి నెల నిర్వహించే క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు పాటించాల్సిన ప్రాథమిక విధానాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రొఫెషనల్ స్టాండర్డ్స్‌ను పాటించడాన్ని అధికారులు పోటీగా తీసుకోవాలని సూచించారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలి ంచాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఆయా జిల్లాల పర్యటనలు, పోలీస్‌స్టేషన్ల తనిఖీల సమయంలో గుర్తించే అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. నేరాల ధోరణిని ముందుగానే గుర్తించి, అవసరమైన చోట ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా హాజరయ్యారు. అలాగే, రాష్ట్రంలోని అన్ని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్రంలో 7.15శాతం నేరాలు పెరిగాయని డీజీపీ వెల్లడించారు. మాదకద్రవ్యాల కేసుల్లో 46.10శాతం వృద్ధి సాధించిందని అన్నారు. సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15 శాతం పెరిగాయని వివరించారు. 2023-24లో 2,65,377 కేసులు నమోదుకాగా.. 2025-26లో 2,84,363కు చేరాయని చెప్పారు. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కి పెరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాల కేసులు 2023-24లో 2,026 ఉండగా.. 2025-26లో 2,960కు చేరాయని ప్రస్తావించారు. మూడేళ్లలో 46.10 శాతం పెరిగాయని వెల్లడించారు. వ్యవస్థీకృత నేరాలు 25 నుంచి 451కు పెరిగి 1,704 శాతం వృద్ధిని నమోదు చేశాయని అన్నారు. ట్రాఫిక్ నేరాలు 29,130 నుంచి 31,891కు పెరిగి 9.48 శాతం వృద్ధి చెందాయన్నారు.

# ముఖ్యమంత్రికి రాఖీలు కట్టిన మహిళా మంత్రులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి పై చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలిని అవుతానని సమాధానం ఇచ్చారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతోనే పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సీఎం నివాసానికి కొండా సురేఖ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే బ్రహ్మకుమారీలు, హోంగార్డులు, మహిళా కానిస్టేబుళ్లు కూడా సిఎం రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టారు. వారి పట్ల సిఎం రేవంత్ వాత్సల్యం ప్రకటించారు.

# గవర్నర్‌ను పరామర్శించిన భట్టి

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్ ని శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కూడా గవర్నర్‌ను వేరుగా పరామర్శించారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీసారు.

# అర్హులందరికీ ఇళ్లు కేటాయిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

లక్కీడ్రాలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. అర్హులైన పేదలందరికీ నిష్పక్షపాతంగా ఇళు ఇస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా రూ. వందల కోట్లు ధర పలికే భూముల్లోనూ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. మొదటివిడతలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ ఇళ్లు ఇచ్చామని, మరో 10 రోజుల్లో రెండో విడత జాబితా విడుదల చేస్తామన్నారు. 16 నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించి టెండర్లు పూర్తిచేశామన్నారు. రెండు, మూడు రోజుల్లో టవర్ల నిర్మాణం ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయట్లేదన్నారు. పదేళ్ల తర్వాత ఇంటిని అమ్ముకునే హక్కు లబ్ధిదారులకు ఉందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఇంటిని తాకట్టు పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

# పొంచి ఉన్న మరో వరద ముప్పు

**ఖాట్మండు, ఆగస్టు28 :** నేపాల్‌లో పెను విషాదాన్ని మిగిల్చిన వరదలలో మరణించిన వారి సంఖ్య శుక్రవారం 547కు చేరింది. సహాయ కార్యక్రమాలు కొనసాగు తుండడంతో శిథిలాల నుంచి మరిన్ని మృతదేహాలు బయటపడుతున్నాయి. భొటెకోషి నది ప్రాంతంలో నీటి మట్టం పెరుగుతుండడంతో మరోసారి వరద ముప్పు పొంచి ఉన్నదన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల క్రితం ఆకస్మికంగా ముంచుకొచ్చిన వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిన ప్రదేశంలో నీటి మట్టాలు పెరుగుతున్నాయని, దీంతో ఆ ప్రాంతంలో మళ్లీ వరదలు సంభవించే అవకాశం ఉన్నదని నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఆరఆరఎంఏ) తెలిపింది. బుధవారం వరదలు సంభవించిన ప్రాంతంలోనే బురదతో కూడిన నీటి మట్టం పెరిగిందని, కాబట్టి ఆ ప్రదేశాన్ని మరోసారి వరద నీరు ముంచెత్తవచ్చునని హెచ్చరించింది. **భారత పర్యాటకులను కలిసిన రాయబారి** వరదల కారణంగా హిమాలయ ప్రాంతాల నుంచి ఖాళీ చేయించిన భార తీయ పర్యాటకులను నేపాల్‌లోని భారత రాయబారి శ్రీవాత్సవ శుక్రవారం కలుసు కున్నారు. ఇండిగో విమానంలో ఖాట్మండు నుంచి భారత్‌కు బయలుదేరిన పర్యాటకులకు ఆయన త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వీడ్కోలు పలి కారు. ఇదిలావుండగా టిబెట్‌లోని చైనా - నేపాల్ సరిహద్దులో సంభవించిన వరదల్లో ఐదుగురు చనిపోయారని, 260 మంది విదేశీయులు సహా 558 మంది జాడ తెలియడం లేదని చైనా తెలిపింది. కాగా విపత్తు సహాయ నిధికి నెల జీతం విరాళంగా అందించాలని నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన క్యాబినెట్ సహచరులు నిర్ణయించారు. శుక్రవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని ఖాట్మండు పోస్ట్ పత్రిక తెలియజేసింది. ఆకస్మిక వరదలలో నష్టపోయిన వ్యక్తులు, వ్యాపారుల కోసం సహాయ, ఆర్థిక, పునరావాస ప్యాకేజీని రూపొందించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖను క్యాబినెట్ ఆదేశించింది.

# సెప్టెంబర్ 2 నుంచి బీఆర్ఎస్ పోరుబాట

(మొదటి పేజీ తరువాయి)



కేంద్రాల్లో ధర్నాలు, 3న వ్యవసాయ విధ్వంసంపై అన్ని నియోజకవర్గాల్లో రైతు సదస్సులు, నిరసనలు, 4న మహిళలకు ఇచ్చిన హామీల అమలు వైఫల్యంపై ఆందోళనా కార్యక్రమాలు, 5న ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌పై పోరాటం, 6న హైదరాబాద్‌లో నగర సమస్యలపై ఆటోలతో భారీ ర్యాలీ, 7న, ప్రజావాణి కేంద్రాల్లో కాంగ్రెస్ హామీల వైఫల్యంపై వినతిపత్రాలు 8న వారం రోజుల పోరాట కార్యక్రమాలపై అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రెస్‌మీట్లు, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని పార్టీ శ్రేణులను కోరారు. అలాగే సెప్టెంబర్ 10న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నిరసనలకు బీఆర్ఎస్ పార్టీ తరపున సంఘీభావం తెలియజేయాలన్నారు. మొత్తం కార్యక్రమాలను పార్టీ కేంద్ర కార్యాలయం ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తుందని కేటీఆర్ తెలిపారు. ప్రతి కార్యక్రమంపై నివేదికలు తీసుకోవడంతోపాటు పార్టీ కేడర్‌ను అప్రమత్తం చేసి నాయకులకు అవసరమైన మార్గదర్శకాలు అందజేస్తామని చెప్పారు. పార్టీ నిర్దేశించిన కార్యాచరణను ప్రతి ఒక్కరూ తమ తమ కార్యక్షేత్రాల్లో విజయవంతం చేసి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని విజ్ఞప్తి చేశారు.

# సంపాదకీయం



# కాంగ్రెస్‌లో కలుపు మొక్కలు !

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు కొత్తేమీ కాదు.. ఇవే మొదలు కాదు..ఇవే చివరికి కూడా కావు. అధికారం ఉంటే ఒక రకమైన కొట్లాట ఉంటుంది. లేకుంటే మరో రకమైన కొట్లాట ఉంటుంది. ఇవన్నీ కూడా ఆధిపత్యపోరులో భాగమే. ఒకరంటే ఒకరికి పడదు. ఒకరంటే ఒకరికి గిట్టదు. ప్రజల పేరు చెప్పి, పథకాల పేరు చెప్పి దంబాచారాలు ప్రచారం చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ఏ ఒక్కరు కూడా సమయం వెచ్చించి ప్రజా సమస్యలపై మాట్లాడరు. తాజా పరిణామాలను పరిశీలిస్తే...రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ఇప్పుడున్న కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోవడం లేదన్నది ముమ్మాటికి నిజం. రేవంత్ టిడిపి నుంచి కాంగ్రెస్‌లోకి రావడం అన్నదే వారు చూసారు తప్ప కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకుని వచ్చారన్న నిజాన్ని పట్టించుకోరు. అందుకే అడపాదడపా వారు నోరు పారేసుకుంటారు. మేమున్నామని చెప్పుకునే ప్రయత్నం చేస్తుంటారు. మంత్రిగా కొండా సురేఖ పెద్దగా పొడించిందేమీ లేదు. దేవాదాయశాఖలో ఎన్ని గుళ్లుల ఉన్నాయో, ఎంతమంది పూజారులు ఉన్నారో, ఎలాంటి పూజాదిక వ్యవస్థ మనదగ్గర ఉందో ఆమెకు తెలియదు. బ్రోచర్లు విడుదల చేయడం, బోనాలెత్తడం తప్ప ఈ మూడేళ్లలో ఆమె చేసింది శూన్యం. దేవాలయాలు కునారిల్లుతున్నాయి. ధూపదీప నైవేద్యాలు అందడం లేదు. అన్యాక్రాంతం అయిన భూముల్లో ఇంచు భూమి కూడా ఆమె వెనక్కి తీసుకోలేదు. గ్రామాల్లో దేవాలయాల భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి, కొందరు ఏకంగా పట్టాలు చేసుకున్నారు. ఉమ్మడి వరగంల్ జిల్లాలోనే ఇలా వందలాది ఎకరాలు ఉంటాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట చెన్నకేశవస్వామి దేవాలయ భూములు కౌలు చేస్తున్నవారే పట్టాలు చేయించుకున్నారు. జీడికల్ భూములు, కొండాపూరం భూములు, ఇలా చెప్పుకుంటూ పోతే ఊరికో చరిత్ర ఉంది. ఆమె ఏనాడూ ఈ భూముల గురించి మాట్లాడడం లేదు. అటవీ శాఖ మంత్రిగా అసలు ఒక్క మొక్కయినా నాటి పెంచారా అన్న అనుమానం కలుగుతుంది. ఎపిలో పవన్ కళ్యాణ్ సామాజిక వనాల పెంపునకు పాల్పడుతుంటే ఇక్కడ కనీసం వరమహోత్సవాలు లేవు. ఉన్నా మొక్కుబడిగా సాగుతున్నాయి. ఇవన్నీ వదిలేసి కూతురుతో సిఎం రేవంత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయించి, తనకేమీ సంబంధం లేదన్నట్లుగా మాట్లాడడం వారికే చెల్లింది. నిజానికి ఆమె దేవాలయాలను పట్టించుకుని, అడవులను పట్టించుకుని ఉంటే జనం ఆమె అంటే అభిమానం చూపేవారు. కానీ కూతరు రాజకీయం ముఖ్యం. రాజకీయాలు తప్ప ప్రజల సేవ ముఖ్యం కాదు. ఇక చిన్నరెడ్డి కూడా అంతే. ప్రణాళికి సంఘం ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. ప్రజావాణిలో వచ్చిన అనేక ముఖ్యమైన సమస్యలు ఏమిటో వాటిని ఎలా పిరష్కరించారో చెప్పలేరు. రాజగోపాల రెడ్డికి మంత్రి పదవి కావాలి. ఆయన జీవిత ధ్యేయం అదే. అందుకే ఇప్పుడు కాంగ్రెస్‌లో డ్రామాలు నడుస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ దశదిశా లేకుండా వ్యవహరించింది. కెసిఆర్‌ను నమ్మిన ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మలేదు. అందుకే అధికారం లోకి రావడానికి తొమ్మిదిన్నరేళ్లు పట్టింది. ఇది కూడా కాంగ్రెస్ పార్టీని చూసి ఓటేయలేదు. కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావుల అవినీతి కార్యక్రమాలతో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. ఈ విషయం కాంగ్రెస్‌కు అర్థం కావడం లేదు. నిజానికి కాంగ్రెస్‌లో బలమైన నేతగా ఎదిగిన అవకాశం ఉమ్మడి ఎపిలో ఒక్క రాజశేఖర్ రెడ్డికే సొంతం. ముఖ్యమంత్రిగా దాదాపు మూడేళ్లు పూర్తిచేసుకోబోతున్న రేవంత్‌రెడ్డి బలమైన నాయకుడిగా ఎదగలేక పోయారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆ పార్టీ సంస్కృతిలో భాగమని ఊరుకోక తప్పదు. ఎందుకంటే కొండాసురేఖ,చిన్నారెడ్డిలపై కఠిన చర్యలు తీసుకునే సాహసం కాంగ్రెస్ నేతలు చేయరు. నిజంగానే వీరిద్దరిని పీకి అవతల పడేస్తే కాంగ్రెస్‌లో చురుకు పుడుతుంది. కాంగ్రెస్ బలం పెరుగుతుంది. జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య పార్టీని వీడితే ఏమయ్యింది. వీరు పోయినా ఏమీ కాదు. రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ కొంత మంది కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. అంతర్గత కుమ్ములాటలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఏవగింపు ఏర్పడింది. బిఆర్సను మించి పాలన సాగిస్తారని అనుకుంటే మంత్రులంతా పర్సంటేజీల ఖాతాలు తెరిచారు. గ్రామస్థాయిలో అవినీతి మరింత పెరిగింది. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు ఎక్కుపెట్టడం భరిస్తూ పోతే వీరి జాబితా పెరగడమే తప్ప తగ్గదని గురించాలి. రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కిక్కురుమనకుండా పనిచేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాత్రం తలలు ఎగరేస్తున్నారు. ఈ ఇద్దరు నేతు ఏ పార్టీలోకైనా వెళ్లి రాగలరని ఇప్పటికే రుజువయ్యింది. బిఆర్ఎస్ పాలనను నిలదీస్తూ...ముఖ్యమంత్రి కేసీఆర్‌ను దీటుగా ఎదుర్కొనే సత్తా రేవంత్‌రెడ్డికి మాత్రమే ఉందన్న నమ్మకంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్‌ను తొలగించడం రేవంత్‌రెడ్డికి కలిసొచ్చింది. కేసీఆర్ పోకడల పట్ల విముఖంగా ఉన్న ప్రజలు ప్రత్యామ్నాయ నాయకుడిగా రేవంత్‌రెడ్డిని ఎంచుకున్నారే తప్ప కాంగ్రెస్‌పైనో లేదా రాహుల్‌పైనో ప్రేమతో కాదు. కేసీఆర్‌కు ప్రత్యామ్నాయం ఎవరన్న ప్రశ్న ఉదయించినప్పుడు, తాను ఉన్నానన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించడంలో రేవంత్‌రెడ్డి విజయం సాధించడంతోనే ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. అధికారం దక్కాక ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో మంత్రులదీ పెద్ద పాత్రే ఉంది. అయితే పాత కాంగ్రెస్ సంస్కృతిని మరవకపోవడంతో పార్టీలో క్రమశిక్షణ కట్టుతప్పింది. వీరివల్ల ఎన్నుకున్న ప్రజలకు రాష్ట్ర ప్రజలకు ఉపయోగం లేదన్న ప్రచారం బాగా వ్యాప్తి చెందుతున్న వేళ కొండా సురేఖ లాంటి వారి చర్యలు కాంగ్రెస్‌కు బలహీనతే తప్ప బలం కాదు. వీరిని వదిలించుకుంటే తప్ప మేలు జరగదు. కాంగ్రెస్ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# బిసి, ఇబిసి విద్యార్థులకు చేయూత

## విదేశీ విద్యకోసం తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం

## సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులను స్వీకరణ

**హైదరాబాద్,ఆగస్ట్28:** విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ విడతలో మొత్తం 350 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందులో 250 మంది బీసీ విద్యార్థులు, 100 మంది ఈబీసీ విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు. సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హత కలిగిన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దరఖాస్తులను తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. ఈ పథకం ద్వారా విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా కోర్సులను అభ్యసించేందుకు అర్హులైన విద్యార్థులకు అవకాశం లభిస్తుంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉండాలి. దరఖాస్తుదారుల వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండాలి.విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. జిఆర్‌ఇ, జిమాట్ స్కోర్‌తో పాటు టోఫెల్ తదితర పరీక్షల్లో అవసరమైన స్కోర్ సాధించి ఉండాలి. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యం ఉన్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి మంచి అవకాశాన్ని అందిస్తోంది.

# ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ డిజిటల్ ప్రాజెక్ట్

## • విశాఖ కేంద్రంగా గూగుల్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్

**అమరావతి,ఆగస్ట్28:** ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ డిజిటల్ ప్రాజెక్ట్ దక్కింది. ముంబై, చెన్నై తర్వాత దేశంలో మూడో అతిపెద్ద డిజిటల్ ల్యాండింగ్ హబ్‌గా ఏపీ అవతరించనుంది. సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్స్ నిర్మాణంలో గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు భాగస్వామ్యం కానున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా గూగుల్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌తో పాటు ఎఐ ఫెసిలిటీ అందుబాటులోకి రానుంది. మైక్రోసాఫ్ట్, లైట్‌స్టార్మ్, సింగ్‌టెల్ భాగస్వామ్యంతో సుమారు 3,600 కిలోమీటర్ల పొడవైన సముద్రగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.



ఈ కేబుల్ ద్వారా విశాఖపట్నానికి సింగపూర్, ఆగ్నేయాసియా ప్రాంతాలతో నేరుగా కనెక్టివిటీ ఏర్పడనుంది. 2029 ఆఖరు నాటికి మైక్రోసాఫ్ట్-లైట్‌స్టార్మ్ సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్ నెట్‌వర్క్ అందుబాటులోకి రానుంది. మచిలీపట్నం-హైదరాబాద్-ముంబై, చెన్నై-హైదరాబాద్-ముంబై మార్గాల్లో కొత్త అంతర్గత డిజిటల్ ÷బైర్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నారు. దీంతో విశాఖపట్నం అంతర్జాతీయ డిజిటల్ గేట్‌వేగా మారే అవకాశం ఉంది. విశాఖపట్నం కేంద్రంగా గూగుల్ 'అమెరికా-ఇండియా కనెక్ట్' సబ్‌సీ కేబుల్‌ను ఏర్పాటు చేయనుంది. విశాఖ గూగుల్ సెంటర్‌లో పవర్-హంగ్రీ ఎఐ మోడల్స్ కంటే ఎఐ ఇన్ఫరెన్సింగ్, క్లౌడ్ సేవలకే మొగ్గు చూపనున్నట్లు తెలుస్తోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విశాఖ ఫెసిలిటీలో పునరుత్పాదక విద్యుత్, ఎయిర్ కూలింగ్ టెక్నాలజీలను గూగుల్ ఉపయోగించుకునే అవకాశం ఉంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న రాజకీయ అశాంతి నేపథ్యంలో సురక్షిత డిజిటల్ కారిడార్‌గా భారత తూర్పు తీరం రూపుదిద్దుకోనుంది.

# ఇరాన్‌పై ఆగని దురాగతం!



అమెరికా-ఇజ్రాయిల్ కలిసి ఇరాన్‌పై అక్రమంగా ఫిబ్రవరి 28న ప్రారంభించిన దాడులతో తలెత్తిన సంక్షోభానికి ఆరునెలలు నిండాయి. మిలిటరీ చర్యలతో ఇంకేమాత్రం ప్రయోజనం లేదని, ఇరాన్ లొంగేఘటం కాదని మిలిటరీ, సలహాదారులు తెగేసి చెప్పటంతో గత కొద్ది వారాలుగా దాడులు లేవు. బలప్రయోగానికి బదులు ఆర్థిక ఆంక్షలతో మరింతగా వత్తిడి తెచ్చేందుకు ట్రంప్ సరికొత్త ఆంక్షలను ప్రకటించాడు. ఇరాన్‌తో వాణిజ్య లావాదేవీలను జరిపే దేశాల మీద కూడా ఆంక్షలు విధిస్తామని చెప్పాడు. అయితే తాజా ఆంక్షలు కొత్తగా ఇరాన్‌కు చేసే హానేమీ లేదని పరిశీలకులు చెప్పేశారు. అయితే ఇలాంటి పరిణామాలను ఇరాన్ ముందే ఊహించింది. తమ పౌరులు కొంత మేరకు ఇబ్బందులు పడుతున్నారని నేతలు బహిరంగంగానే అంగీకరిస్తూ, తాజా ఆంక్షలను ఎదుర్కొనేందుకు తగిన చర్యలు తీసుకున్నామని కూడా ప్రకటించారు. ఇరాన్ చెప్పే మాటలు కొందరికి అతిశయో క్తిగా అనిపించవచ్చు గానీ గత ఆరు నెలల్లో వారు చెప్పిందే వాస్తవ మని, ట్రంప్ చెప్పి నట్లుగా జరగలేదని ఇప్పటికే రుజు వైంది. నాలుగైదు వారాల్లో టెహరాన్ సంగతి తేల్చేస్తామని, కాళ్ల బేరానికి తెస్తామని కోతలు కోశాడు. ఆరునెలల తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే ఈ సంక్షోభం నుంచి బయటపడి నవంబరు మూడవ తేదీన జరిగే పార్లమెంటు మధ్యంతర ఎన్నికల్లో ఓటర్ల ముందుకు ఎలా వెళ్లాలో అతగాడికి దిక్కుతోచటం లేదు. ఇరాన్‌పై దాడులకు మొత్తంగా అమెరికన్ పౌరులే కాదు, చివరికి స్వంత పార్టీ వారి మద్దతే రోజు రోజుకూ తగ్గుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఇరాన్ చేతిలో అటు పరువూ పోయి ఇటు చేతి చమురు వదిలిస్తున్న నిర్వాకం గురించి అడిగే ప్రశ్నలకు వెర్రిచూపులు తప్ప ట్రంప్‌కు నోట మాట రావటం లేదు. పచ్చి అబద్దాలు చెబుతున్నాడు. హోర్ముజ్ జలసంధి తెరిచే ఉందని, అడపాదడపా ఇరాన్ వైపు నుంచి వస్తున్న కొన్ని క్షిపణలు, సముద్రంలో మందుపాతరలు అమర్చటం తప్ప నౌకల రవాణాకు ఎలాంటి ఆటంకం లేదని ప్రపంచాన్ని నమ్మించేందుకు చూడటం తాజా అబద్ధం. ఇరాన్‌తో ఎలాంటి ఒప్పందానికి వచ్చినా తాట వలుస్తామని బెదిరించి నప్పటికీ హోర్ముజ్ జలసంధిలో రెండుదేశాలూ కలసి నౌకలపై రాకపోకల రుసుము వసూలు చేసేందుకు ఇరాన్‌తో ఓమన్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై విధించిన తాజా ఆంక్షలు అక్రమని చైనా వాటిని తిరస్కరించింది. ఇరాన్ నుంచి అది ఇప్పటికీ పెద్ద మొత్తంలో ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నది. ఒక వేళ చైనా మీద కూడా ఆంక్షలు ప్రకటిస్తే కంటికి కన్ను పంటికి పన్ను మాదిరి బీజింగ్ కూడా బదులు తీర్చుకుంటుదని వేరే చెప్పనవసరం లేదు. గతేడాది ప్రకటించిన పన్నుల పట్ల అదే విధంగా వ్యహరించటంతో అమెరికా కాళ్లబేరానికి వచ్చి వెనక్కు తగ్గింది. ఒక్క ఇరానే కాదు, రష్యాతో లావాదేవీలు జరిపే దేశాల మీద కూడా ఆంక్షలు విధిస్తామని అది ప్రకటించింది. అయితే దాన్ని ధిక్కరించి మనదేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నప్పటికీ కిమ్మనటం లేదు. దీనర్థం ఏమిటి? మనదేశం అమెరికాతో ఇతర విషయాల్లో రాజీపడుతున్నందుకు ఈ మినహాయింపా? ఇరాన్ మీద ఏకపక్షంగా దాడులు ప్రకటించినపుడు ట్రంప్ చెప్పిందేమిటి, ఇప్పుడు చేస్తున్నదేమిటి ? టెహరాన్ ఒకటి రెండు నెలల్లోనే అణుబాంబును తయారు చేయగల సామర్థ్యాన్ని సమకూర్చుకున్నదని ఫిబ్రవరికి ముందు మీడియాలో కథనాలు రాయించారు. ఇరుగు పొరుగు దేశాలకు తలెత్తిన ముప్పును తప్పించేందుకు దాడులు చేసినట్లు చెప్పారు. దాని వలన ఎలాంటి ఫలితమూ రాలేదు. అసలు శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్ ఎక్కడ దాచిందో కూడా కనిపెట్టలేక పోయాడు. తరువాత హోర్ముజ్ జలసంధిలో స్వేచ్ఛగా రాకపోకలు సాగించేం దుకు అడ్డుపడుతున్న ఇరాన్‌ను దెబ్బతీసేం దుకు దాడులని చెప్పాడు. ఈ విషయంలో కూడా సాధించిందేమీ లేదు. ఇలా లక్ష్యాలను మారుస్తూ ఇప్పుడు ఆర్థిక వెలి ప్రచారాన్ని ప్రారంభించాడే. నిజానికి తనతో కలసి దుర్మార్గంలో నాటో దేశాలు పాలుపంచుకుంటాయని అమెరికా భావించాడు. కానీ, దాడులతో తమకు సంబంధం లేదని ఐరోపా దేశాలు అమెరికాను వెలివేశాయి. ఇరాన్ మీద దాడులకు విమానాలకు అవసరమైన ఇంధనం నింపుకొనేందుకు బల్గేరియా వంటి నాటో దేశాల్లో ఏర్పాట్లు చేసుకున్నది. అది తగదని టెహరాన్ హెచ్చరించిందే తప్ప ఎలాంటి చర్యలకూ దిగలేదు. అయితే అమెరికాకు బ్రిటన్ అప్పగించిన డిగోగార్సియా దీవిలోని మిలిటరీ స్థావరాలపై క్షిపణులను ప్రయోగించి తమ సత్తాఏమిటో చూడండని, దాని కంటే చాలా దగ్గరగా ఉన్న అలాంటి దేశాలకు ఒక సందేశాన్ని పంపింది. అవకాశవాదం లేదా తమకు రక్షణ కల్పిస్తుందనే విశ్వాసంతో గల్ఫ్ దేశాలు తమ గడ్డ మీద అమెరికా మిలిటరీ స్థావరాల ఏర్పాటుకు అవకాశమిచ్చాయి. వాటి మీద దాడులు చేసి తీవ్ర నష్టం కలిగించిన తీరు చూసి ఇరాన్ మీద దాడులు ఆపండని మీద వత్తిడి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ విధంగా ఆరునెలల్లో అనేక ఎదురుదెబ్బలు తిన్నప్పటికీ ట్రంప్‌నకూ అతగాడిని భరిస్తున్న అమెరికాకు బుద్ధిరాలేదు!

# ఎర్రగడ్డ డివిజన్ అభివృద్ధికి పెద్దపీట..

## పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే..






**జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 28 :** ఆధ్వర్యంలో ఎర్రగడ్డ డివిజన్‌లో రూ.62.70 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, పాదచారుల భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ పనులను చేపట్టామన్నారు. జహీరా గుల్షన్ బాగ్‌లో రూ.7 లక్షలతో సీసీ రోడ్డు, ముకేష్ షాప్ ఎదురుగా ఉన్న లేన్‌లో నీటి నిల్వ సమస్యకు పరిష్కారంగా రూ.31 లక్షలతో పైప్‌లైన్, వర్షపు నీటి డ్రైనేజీ వ్యవస్థతో పాటు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.. అదేవిధంగా ఐఏ కన్వెన్షన్ వద్ద రూ.5 లక్షలతో నూతన సీసీ రోడ్డు, కల్పతరువు వద్ద రూ.19.70 లక్షలతో పాదచారుల సౌకర్యం కోసం ఫుట్‌పాత్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచి, స్థానిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ - తెలంగాణ రాష్ట్ర కార్యాలయం

- **విశ్వనగరం పేరిట హైదరాబాద్‌ను విషాద నగరంగా మార్చారు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు ఫైర్‌లి**
- **తార్నాక డివిజన్‌లో శ్రీ మాదాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో బీజేపీలో చేరిన పలువురు విద్యావంతులు, స్థానికులు.**
- **పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు గారు.**
- **రాబోయే మూడు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తేనే కేంద్ర పథకాలు మరింత పారదర్శకంగా ప్రజలకు అందుతాయి.**



**మీడియా విభాగం తేదీ: 28-08-2026, హైదరాబాద్ :** ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో అందుతున్న సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై సమాజంలోని విద్యావంతులు, మేధావులు, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీ వైపు చూస్తున్నారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు గారు తెలిపారు. తార్నాక డివిజన్‌లో శ్రీ మాదాల రాధాకృష్ణ గారి ఆధ్వర్యంలో పలువురు విద్యావంతులు, స్థానిక ప్రముఖులు బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి శ్రీ ఎన్. రాంచందర్ రావు గారు కాషాయ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీ ఎన్. రాంచందర్ రావు గారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను 'విశ్వనగరం' చేస్తామని గొప్పలు చెప్పి గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ కలిసి మహానగరాన్ని 'విషాద నగరం'గా మార్చేశాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జీహెచ్ఎంసీ పరిధిలో సరైన మౌలిక వసతులు లేక, అధ్వానపు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కావడం, సమస్యలతో నగర ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతూ అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత, ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యంతో భాగ్యనగర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. హైదరాబాద్ అభివృద్ధి ఒక్క భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని నగర ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాబోయే మూడు మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో ప్రజలు బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ మూడు కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలిస్తే ప్రధాని నరేంద్ర మోదీ గారి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అత్యంత పారదర్శకంగా నేరుగా ప్రజల వద్దకు చేరుతాయని శ్రీ ఎన్. రాంచందర్ రావు గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాదాల రాధాకృష్ణతో పాటు పలువురు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధుయాష్కి గౌడ్‌కు రాఖీ కట్టిన మంత్రి సీతక్క



- **అన్నా-చెల్లెలి ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి వేడుకలు**

**భవిష్యత్ ప్రజా పాలన, హైదరాబాద్, ఆగస్టు 28:** రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ మంత్రి సీతక్క, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ నివాసానికి వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. బంజారాహిల్స్‌లోని మధుయాష్కి గౌడ్ నివాసంలో జరిగిన ఈ ఆత్మీయ కార్యక్రమంలో సీతక్క, మధుయాష్కి గౌడ్ మధ్య ఉన్న అన్నా-చెల్లెలి అనుబంధం మరోసారి ప్రతిబింబించింది. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని తన ఆత్మీయ సోదరుడైన మధుయాష్కి గౌడ్‌కు సీతక్క రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇద్దరూ పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా సీతక్కకు మధుయాష్కి గౌడ్ కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికారు. రాఖీ కట్టిన అనంతరం సీతక్క, మధుయాష్కి గౌడ్‌కు స్వీట్లు తినిపించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మధుయాష్కి గౌడ్ కూడా సీతక్కతో ఆత్మీయంగా మాట్లాడి రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది. ప్రతి సంవత్సరం రాఖీ పౌర్ణమి సందర్భంగా సీతక్క, మధుయాష్కి గౌడ్‌కు రాఖీ కట్టి తమ మధ్య ఉన్న అన్నా-చెల్లెలి అనుబంధాన్ని చాటుకుంటున్నారు. రాజకీయంగా వేర్వేరు బాధ్యతల్లో కొనసాగుతున్నప్పటికీ, వ్యక్తిగతంగా తమ మధ్య ఉన్న ఆత్మీయత, అనుబంధాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాతృమూర్తి, కుటుంబంలోని అక్కలతో కూడా మంత్రి సీతక్క ఆత్మీయంగా మాట్లాడారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కొంతసేపు కుటుంబ సభ్యులతో సరదాగా ముచ్చటిస్తూ ఆప్యాయతను పంచుకున్నారు. రాఖీ పౌర్ణమి పండుగ సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర నమ్మకానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో సీతక్క, మధుయాష్కి గౌడ్ మధ్య కొనసాగుతున్న అన్నా-చెల్లెలి అనుబంధం రాఖీ పండుగ సందర్భంగా మరోసారి ప్రత్యేకంగా నిలిచింది. రాజకీయ కార్యక్రమాలకు భిన్నంగా కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ రాఖీ వేడుకలో సోదరభావం, కుటుంబ అనుబంధం స్పష్టంగా కనిపించింది. ప్రతి సంవత్సరం కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా సీతక్క కొనసాగించారు.

# పెద్ద చింతరేవులలో శాస్త్రోక్తంగా రక్షాబంధన్ వేడుకలు...

- **పాలిమర్ పీఠాధిపతులచే వరమహాలక్ష్మి వ్రతం....**
- **మేద పండితులచే యజుర్వేద ఉపకర్మ హోమ పూజలు...**
- **పీఠాధిపతులచే రామాయణ,భాగవత ప్రవచనాలు...**









**జోగులాంబ గద్వాల: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** జిల్లా దారూర్ మండల పరిధిలోని 15వ శతాబ్దంలో వ్యాసరాయుల వారిచే ప్రతిష్ఠింపబడి నేటికీ పూజలు అందుకుంటున్న ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ పౌర్ణమి నాడు పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యా దీశ శ్రీపాదలవారు ఆంజనేయ స్వామి వారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్యా చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు. పెద్ద చింతరేవుల అన్న ప్రసాద భవనంలో ఉడిపి పాలిమర్ పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యాదిశ శ్రీపాదలవారు, శ్రీ 1008శ్రీ విద్యా రాజేశ్వర శ్రీపాదల వారిచే మూల రాముల వారికి వేద యుక్తంగా ప్రత్యేక పూజలు ఉడిపి వేద పండితులచే నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి నాడు వేదమూర్తులైన బ్రాహ్మణులకు సామూహిక రక్షాబంధనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతులు వరలక్ష్మి కార్యక్రమాన్ని వేదమంత్రో చరణాల మధ్య నిర్వహించారు. జగత్ జనని అమ్మవారి కృపాకటాక్షాలు పొందుటకు ప్రత్యేకంగా అమ్మవారిని పూజించినట్లు తెలిపారు.అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే అని కేశవాచార్యులు తెలిపారు. జ్ఞాన సంపద పెరుగుటకు హయగ్రీవ పూజలు చేశారు. వరలక్ష్మీ వ్రతాన్ని పూజించే ముందు పీఠాధిపతులు గోపూజను నిర్వహించి, ప్రత్యేక యజ్ఞమంటపంలో నవగ్రహ, పవమాన హోమాలు చేశారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులందరికీ పీఠాధిపతులు ఆశిర్వచనాలు అందజేశారు. అనంతరం పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి అన్నప్రసాద ట్రస్ట్ వారిచే భక్తులందరికీ అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అర్చకులు ఆధ్య వామనాచారి,ఆద్య కిష్టాచారి,ఆద్య మద్వాచారి, దేవాలయ చైర్మన్ గిరి రావు, భక్తులు మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# జై స్వరాజ్ పార్టీ చిట్యాల మండల అధ్యక్షుడిగా నర్రి నర్సింహా నియామకం




**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 28 : చిట్యాల:** జై స్వరాజ్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, గ్రామ స్వరాజ్య ఉద్యమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు పార్టీ అధిష్ఠానం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండల అధ్యక్షుడిగా తాళ్లవెల్లంల గ్రామానికి చెందిన నర్రి నర్సింహాను జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ నియమించారు. నర్రి నర్సింహా జనగాం వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో జై స్వరాజ్ పార్టీలో చేరి, పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని జాతీయ అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరావు గౌడ చేతుల మీదుగా స్వీకరించారు. అనంతరం ఆయనకు చిట్యాల మండల అధ్యక్ష బాధ్యతలను కాసాని శ్రీనివాసరావు గౌడ అందజేశారు. ఈ సందర్భంగా కాసాని శ్రీనివాసరావు గౌడ మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యమే దేశ అభివృద్ధికి పునాది అని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలను చైతన్యవంతులను చేసి, గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో పాలన సాగించే దిశగా జై స్వరాజ్ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు.

నర్రి నర్సింహా తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, చిట్యాల మండలంలోని ప్రతి గ్రామానికి పార్టీ సిద్ధాంతాలను, గ్రామ స్వరాజ్య ఉద్యమ లక్ష్యాలను తీసుకెళ్లాలని సూచించారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులు, పేదలు, సామాన్య ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేసి పార్టీని మండలస్థాయిలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. "మన రాజ్యం - మనం ఏలుదాం" అనే లక్ష్యంతో గ్రామ స్వరాజ్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాసాని శ్రీనివాసరావు గౌడ కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ జనగాం వెంకటేష్ గౌడ్, జై స్వరాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# దేవేందర్ నగర్‌లో కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన

- **అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు**



**ఉప్పల్, ఆగష్టు 28(భవిష్యత్ ప్రజా పాలన):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, దేవేందర్ నగర్, ఉప్పల్ సర్కిల్‌లో జరుగుతున్న వివిధ పౌర, మౌలిక వసతుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రహదారి మార్జిన్ల నిర్వహణ, నాలా శుభ్రత, డీసిల్టింగ్, సీడీ వ్యర్థాల తొలగింపు, మొక్కల పెంపకం, గుంతల పూడ్చివేత తదితర అంశాలను కమిషనర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.

**మొక్కల పెంపకం, రోడ్డు మార్జిన్ల నిర్వహణ**



రోడ్డు మార్జిన్లలో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో క్రమం తప్పకుండా మొక్కలు నాటాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. నాటిన మొక్కలను సక్రమంగా సంరక్షించాలని, రోడ్డు మార్జిన్లను శుభ్రంగా, సమతలంగా ఉంచడంతో పాటు అనవసర వస్తువులు, వ్యర్థాలు మరియు ఇతర అడ్డంకులు లేకుండా చూడాలని సూచించారు.

**దేవేందర్ నగర్ నాలా పనులు**

నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి అంబర్‌పేట్ ఎస్ టీ పి వరకు దేవేందర్ నగర్ నాలా వెంట జరుగుతున్న పూడికతీత (డిసైలటింగ్ ), ఫెన్సింగ్ పనులను కమిషనర్ పరిశీలించారు. నాలా వెంట పెరిగిన తీగలు, కలుపు మొక్కలను తొలగించి నాలాను పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**సి &డీ వ్యర్థాల తొలగింపు:**

నాలా పరిసరాల్లో పేరుకుపోయిన నిర్మాణ మరియు కూల్చివేత వ్యర్థాలు (సిడడీ వేస్ట్) ను వెంటనే తొలగించాలని ఆదేశించారు. సిడీ వ్యర్థాలను రోడ్లు, రోడ్డు మార్జిన్లు లేదా నాలాల్లో వేయకుండా,వాటిని అధీకృత సిడీ వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా వ్యర్థాలు వేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**గుంతలపూడ్చివేత:**

ప్రాంతంలోని రోడ్లపై ఉన్న గుంతలను గుర్తించి పూడ్చివేత పనులను పరిశీలించిన కమిషనర్, ప్రజలకు సురక్షితమైన మరియు సాఫీగా రాకపోకలు సాగేందుకు గుర్తించిన అన్ని గుంతల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# రాఖీ బంధంతో చాటుకున్న హిందూ-ముస్లిం సోదరభావం



- **మతాలు వేరైనా... మనసులు ఒక్కటే అని నిరూపించిన రాఖీ పండుగ**



**ఉప్పల్,ఆగష్టు 28(భవిష్యత్తు ప్రజాపాలన):** రాఖీ పండుగ సందర్భంగా రామంతపూర్ డివిజన్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ రఫీక్ కి కాంగ్రెస్ మహిళా నాయకులు గాయత్రి గౌడ్, వరలక్ష్మి రాఖీ కట్టి ఆత్మీయంగా రాఖీ పండుగ శుభాకాంక్షలుతెలిపారు ఈ సందర్భంగా జరిగిన రాఖీ వేడుకలు హిందూ-ముస్లిం ఐక్యతకు,సోదరభావానికి, పరస్పర గౌరవానికి అద్దం పట్టాయి. రాఖీ అనేది కేవలం ఒక దారం కాదు... ప్రేమ, నమ్మకం, ఆప్యాయత, రక్షణకు ప్రతీక అని ఈ సందర్భంగా చాటిచెప్పారు. మతం వేరు కావచ్చు... ఆచారాలు వేరు కావచ్చు... కానీ మన మధ్య ఉన్న మానవత్వం ప్రేమ, సోదరభావం మాత్రం ఒక్కటే రామంతపూర్ గడ్డ పై హిందూ-ముస్లిం సోదరులు, అక్కాచెల్లెళ్లు కలిసి మెలిసి పండుగలు జరుపుకుంటూ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నారని మహిళా నాయకులు తెలిపారు. మహమ్మద్ రఫీక్ ప్రజలందరినీ సమానంగా గౌరవిస్తూ,మత సామరస్యం, సామాజిక ఐక్యత, సోదర భావం మరింత బలపడేలా ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.

హిందూ-ముస్లిం ఐక్యతే మన బలం
మతాలు వేరు మనుషులం ఒక్కటే
రాఖీ బంధం - ప్రేమకు ప్రతీక ఐక్యతకు సంకేతం ఐక్యతతో ముందుకుసోదరభావంతో అభివృద్ధి వైపు సాగాలని ఆశ భావం వ్యక్తం చేశారు.

# కర్ణాటకలోని హట్టి గోల్డ్ మైన్స్‌ను

## సందర్శించిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క






**హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 28:** యుటి ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్‌ను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మైన్ వ్యూ పాయింట్ నుండి బంగారం ముడి మట్టి వెలికితీత ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించిన భట్టివిక్రమార్క, ఎంత లోతు నుంచి బంగారం ముడి సరుకు సేకరిస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బంగారం ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను లోతుగా పరిశీలించిన భట్టి విక్రమార్క, గడిచిన 5 ఏళ్ల బంగారు ఉత్పత్తి వివరాలను డిప్యూటీ సీఎంకు నివేదించిన మైనింగ్ అధికారులు, ఓపెన్ కాస్ట్‌తో పాటు భూగర్భ (అండర్‌గ్రౌండ్) గని ఉత్పత్తుల వివరాలపై ఆరా తీసిన భట్టి విక్రమార్క, యుటి ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్‌లో మొక్కను నాటిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, భట్టి విక్రమార్క వెంట సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ వెంకటేశ్వర్లు.



# రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టిన మంత్రులు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు



**రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 28 :** రాఖీ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రాఖీ కట్టిన మంత్రులు సీతక్క, కొండా సురేఖ. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ గద్వాల విజయలక్ష్మి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు బ్రహ్మకుమారి మహిళా కాంగ్రెస్ నాయకురాలు మలక్పేట గవర్నమెంట్ హై స్కూల్ పరిస్థితి బ్రాండ్ గర్ల్స్ విద్యార్థినిలు రాఖీలుకట్టారు.





**హైదరాబాద్ భవిష్యత్తు ప్రజాపాలన సీనియర్ స్టాఫ్**

## విదేశాల్లో ఉన్నత విద్యకు బీసీ, ఈబీసీ విద్యార్థులకు సువర్ణావకాశం

- **మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకానికి సెప్టెంబర్ 1 నుంచి దరఖాస్తులు**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 28 :** మహాత్మా జ్యోతిబా పూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పిస్తోంది. 2026 ఆగస్టు/సెప్టెంబర్ ఫాల్ సెషన్ కోసం దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబర్ 1, 2026 నుంచి సెప్టెంబర్ 30, 2026 వరకు కొనసాగనుంది. ఈ విడతలో మొత్తం 350 మంది విద్యార్థులను ఎంపిక చేయనుండగా, అందులో 250 మంది బీసీ విద్యార్థులు, 100 మంది ఈబీసీ విద్యార్థులు ఉంటారు. విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్/పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా కోర్సులు అభ్యసిస్తున్న లేదా అభ్యసించాలనుకుంటున్న అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ సూచించింది.



అర్హతలు

కుటుంబ వార్షిక ఆదాయం అన్ని వనరుల నుంచి రూ.5 లక్షల లోపు ఉండాలి.

దరఖాస్తు చేసే నాటికి వయస్సు 35 సంవత్సరాలకు మించకూడదు.

గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి.

260 లేదా 500 స్కోర్ కలిగి ఉండాలి.

-60 మార్కులు లేదా -6.0 లేదా 50 మార్కులు స్కోర్ ఏదైనా కలిగి ఉండాలి.

అర్హత కలిగిన విద్యార్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరింది.

మరిన్ని వివరాలు, దరఖాస్తు ప్రక్రియ కోసం తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించింది.

వెబ్‌సైట్:

http://www.telanganaepass.cgg.gov.in

- బాలమయాదేవి

కమిషనర్ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ

# మహాధర్నా విజయవంతం

## ఉద్యోగులకు ఉద్యమ అభినందనలు



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 28 :** రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు 27న ఇందిరా పార్క్, హైదరాబాద్‌లో నిర్వహించిన భారీ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన హైదరాబాద్ జిల్లా, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ నగర శాఖల ఉద్యోగులు, అధికారులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెన్షనర్లకు హృదయపూర్వక ఉద్యమ అభినందనలు. ఈ మహాధర్నాకు హైదరాబాద్ నగరం, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నలుమూలల నుంచి దాదాపు 9,000 మంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సిటీ చైర్మన్ కట్కూరి శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా చైర్మన్ విక్రమ్, రంగారెడ్డి జిల్లా చైర్మన్ శ్రీ పూటు యశ్వంత్, హైదరాబాద్ సిటీ కన్వీనర్ డా. జి. గండూరి వెంకటేష్, జిల్లా కన్వీనర్ ఎం బి కృష్ణ యాదవ్, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ డా. కె రామారావు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు, ఉద్యమ అభినందనలు తెలిపారు. ఉద్యోగుల ఐక్యతే మన బలం - న్యాయమైన డిమాండ్ల సాధనే మన లక్ష్యం.

# పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్

- **క్యూర్ పరిధిలో అత్యంత పారదర్శకంగా ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా**
- **16 నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా**
- **రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ప్రక్రియ**
- **పేదలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత రిజిస్ట్రేషన్.**
- **రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 28 :** హైదరాబాద్ మహానగరంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, కులమతాలు, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని స్పష్టం చేశారు. క్యూర్ ప్రాంతంలో తొలి విడతగా చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు అత్యంత పారదర్శకంగా లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. మీడియా, అర్హులైన లబ్ధిదారుల సమక్షంలో లక్కీడ్రా నిర్వహిస్తూ, మొత్తం ప్రక్రియను అన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కోసం లక్కీడ్రా నిర్వహించారు. నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్‌లో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కేటాయింపునకు వెట్ గార్డెన్స్‌లో, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి పరిధికి సంబంధించి లక్ష్మిగూడలో నిర్వహించిన లక్కీడ్రా కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని డ్రా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈరోజు నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున లక్కీడ్రా ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని మంత్రి వివరించారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన నిర్వహిస్తారని, ఎంపికైన వారిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ విధానం ద్వారా అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారని మంత్రి గుర్తు చేశారు. అనంతరం రికార్డు సమయంలోనే 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి టెండర్లు పిలవడం, మరోవైపు లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి గొప్ప విజయమని అన్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 2లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతల్లో అందిస్తోందని, చివరి విడత బిల్లుల చెల్లింపులు కూడా ప్రారంభమయ్యాయని వివరించారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. మరో పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తయ్యే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వానికి డబ్బు కూడబెట్టుకోవడం కంటే పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా సొంత ఇంటిని అందించడం ముఖ్యమని అన్నారు. ఎకరం రూ.100 కోట్లు, రూ.200 కోట్లు, రూ.300 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లోనూ పేద కుటుంబాలు గౌరవంగా జీవించాలి అని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఇల్లు పొందిన అర్హులైన లబ్ధిదారులకు ఒక్క పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని మంత్రి తెలిపారు. రిజిస్ట్రేషన్ అనంతరం పదేళ్ల తర్వాత అవసరాన్ని బట్టి ఇంటిని విక్రయించుకునే సదుపాయం ఉంటుందని చెప్పారు. అంతకుముందే ఏదైనా అత్యవసర అవసరం ఏర్పడితే, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను బ్యాంకులో కుదువ పెట్టుకుని రుణం పొందే అవకాశం కూడా ఉంటుందని వివరించారు. లక్కీడ్రాలో ఇల్లు పొందిన ప్రతి లబ్ధిదారుడికి సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించి అందిస్తామని మంత్రి చెప్పారు. ఒక్కో ఇంటికి 17 నుంచి 20 గజాల అన్‌డివైడెడ్ షేర్ భూమి కూడా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన స్థలాల్లో అవసరాన్ని బట్టి 10 అంతస్తుల వరకు ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని, లిఫ్ట్‌లతో పాటు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. లక్కీడ్రా పూర్తయిన తర్వాత లబ్ధిదారుల తుది ఎంపిక జరుగుతుందని, అధికారుల పరిశీలన అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తారని మంత్రి తెలిపారు. ఆ తర్వాత కేవలం 3-4 రోజుల్లోనే టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షించుకునే అవకాశం కూడా ఉంటుందని మంత్రి తెలిపారు. నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీడ్రాలో తొలుత ఎస్సీ విభాగానికి కేటాయించిన 14 శాతం రిజర్వేషన్ ప్రకారం 67 ఫ్లాట్ల కోసం 288 మంది పేర్లతో కూడిన చీటీలను డ్రమ్ములో వేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, హౌసింగ్ ఎండీ వి.పి. గౌతమ్, కలెక్టర్ ప్రియాంక తదితర అధికారుల సమక్షంలో లబ్ధిదారులతోనే డ్రా తీయించారు. ఎస్సీ విభాగంలో తొలి ఫ్లాట్‌కు మరకాల కృష్ణవేణి ఎంపిక కాగా, అనంతరం టి.అనిత, మంగనూరి అనసూయ, ఎం.కుమారి, శైలజాకుమారి వరుసగా ఫ్లాట్లను లక్కీడ్రా ద్వారా పొందారు. ప్రతి నియోజకవర్గంలో సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎస్సీలకు - 14 శాతం, ఎస్టీలకు - 5 శాతం, బీసీలకు- 16 శాతం, దివ్యాంగులకు - 5 శాతం పారిశుధ్య కార్మికులు, నాలుగో తరగతి ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు - 10 శాతం చొప్పున రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు వివరించారు. ఈ ఫ్లాట్లలో మొత్తం 50 శాతం రిజర్వేషన్లు ఉండగా, మొత్తంగా మహిళలకు 30 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.









# బంగారం మైనింగ్‌లో హట్టి- సింగరేణి జతకట్టాలి

- **భవిష్యత్తు ప్రాజెక్టుల్లో జాయింట్ వెంచర్‌గా కలిసి పని చేయడానికి పరిశీలన చేయాలి**
- **సింగరేణి అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిశ నిర్దేశం**
- **బంగారం శుద్ధి కేంద్రం పరిశీలన, హట్టి, యుటీ బంగారు గనులలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విస్తృత పర్యటన.**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 28 :** బంగారం మైనింగ్‌లో విశేష అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో సింగరేణి కలిసి పనిచేసేలా జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కర్ణాటక గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటి బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. బంగారు ఖనిజం తవ్వకం నుంచి శుద్ధ బంగారం తయారీ వరకు చేపడుతున్న ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు. హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో అపార అనుభవం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని హట్టి అనుభవంతో జోడించాలని సూచించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతికత వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ తదితర అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు.

**ఆర్థిక భద్రతలో బంగారం కీలకం**

దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయంగా అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలన్నారు. బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి-సింగరేణి భాగస్వామ్యంతో బంగారం ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పనతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని తెలిపారు.

**ఉత్పత్తి నుంచి శుద్ధి వరకు పరిశీలన**

హట్టి గోల్డ్ మైన్స్‌లోని ప్రొడక్షన్ యూనిట్, ఖనిజ శుద్ధి కేంద్రం, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి శుద్ధ బంగారంగా మార్చే విధానాన్ని అధికారులు వివరించారు. హట్టి ప్రాజెక్టు ద్వారా రోజుకు సగటున రెండు నుంచి నాలుగు కిలోల బంగారం ఉత్పత్తి అవుతోందని అధికారులు తెలిపారు. 'యూటి ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్' వ్యూ పాయింట్ వద్ద నిలబడి బంగారం ముడి మట్టిని వెలికి తీసిన ప్రక్రియను, సేకరించిన ప్రదేశాలను ఆయన ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా ఓపెన్ కాస్ట్ గనిలో ఎంత లోతు నుంచి బంగారం తయారీకి కావలసిన ముడి సరుకును తీశారనే వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంగారం ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను లోతుగా పరిశీలించారు. బంగారు ఖనిజ అన్వేషణకు ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తారని అధికారులను అడిగారు. అక్కడి అధికారులు డిప్యూటీ సీఎంతో మొక్కను నాటించారు. అనంతరం యుటీ భూగర్భ గనిలో జరుగుతున్న బంగారు ఖనిజ తవ్వకాలను పరిశీలించారు. భూగర్భ గనిలో ఖనిజంతవ్వకం, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తదితర అంశాలను ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ, యెమ్మూరప్ప గౌడ రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్ దఫేదార్ పాల్గొన్నారు.








# దేవదుర్గ గని నుంచి విరివిగా బంగారం, రాగి తీసి దేశ సంపదను పెంచుదాం



- దేవదుర్గలో కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించిన డిప్యూటీ సీఎం
- దేవదుర్గలో సైట్ క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం
- స్థానికుల సహకారంతో త్వరితగతిన ఖనిజ అన్వేషణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలి.

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 28 :** కర్ణాటకలోని దేవదుర్గ గని నుంచి పెద్ద ఎత్తున బంగారం, రాగి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించడానికి మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాయచూరు జిల్లా, దేవదుర్గ తాలూకా లింగదహళ్ళి గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని అధికారికంగా డిప్యూటీ సీఎం ప్రారంభించారు అనంతరం ఖనిజ అన్వేష ప్రదేశాలను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. దాదాపు 136 సంవత్సరాల సుదీర్ఘ మైనింగ్ అనుభవం ఉన్న సింగరేణి కాలరీస్ సంస్థ, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో దేవదుర్గ్ బ్లాక్ ఎక్స్‌ప్లోరేషన్ (అన్వేషణ) హక్కులను దక్కించుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ, అన్వేషణ పనులను సింగరేణి సంస్థ త్వరలోనే వేగవంతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతమై ఇక్కడ బంగారం, రాగి విరివిగా లభిస్తే ప్రాంతీయంగా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభించడమే కాకుండా ఈ ప్రాంతం శీఘ్రగతిన అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పనుల పర్యవేక్షణ కోసం అధికారులు ఇక్కడే ఉండేలా సింగరేణి ఆధ్వర్యంలో త్వరలోనే ఒక సైట్ ఆఫీస్‌ను, అలాగే రాకపోకల సౌకర్యార్థం హెలిప్యాడ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించిన వెంటనే ఈ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. అలాగే, కృష్ణానదికి ఇరువైపులా ఉన్న తెలుగు, కర్ణాటక ప్రజల మధ్య విడదీయరాని చారిత్రక, సాంస్కృతిక బంధం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలోనే భాగమైనందున మన మూలాలు ఒక్కటేనని గుర్తుచేశారు., స్థానిక ప్రజల అండదండలతో ఈ ప్రాజెక్టును త్వరలోనే విజయవంతంగా పూర్తి చేసి దేశ సంపదను పెంచడానికి ఉపయోగపడదామని పిలుపు నిచ్చారు. ఈ అన్వేషణ రెండు రాష్ట్రాల పురోగతికి, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎంతగానో దోహద పడుతుందని ఆకాంక్షిం చారు. దేవదుర్గ



ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అన్నారు. ఈ ప్రాంతంలో గతంలో సిఐగా పనిచేసిన పని చేశానని ప్రస్తుతం సింగరేణి సంస్థ చైర్మన్ డైరెక్టర్‌గా ఇక్కడ బంగారం రాగి కనీసం పనులను స్థానికుల సమక్షంలో ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ పరమానంద స్వామి గుట్ట పరమానంద స్వామి ఆశీస్సులతో ఇక్కడ బంగారు నిక్షేపాలు లభించాలని స్థానికు లకు ఉపాధి అవకాశాలు కలగాలని ఆకాంక్షించారు.

**రాయచూర్‌లో బంగారం, రాగి ఖనిజ బ్లాకును పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

లింగదహళ్ళి గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు తనయుడు, కాంగ్రెస్ నాయకుడు రవి బోసురాజు స్థానిక సర్పంచ్ ఎల్లమ్మ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా లింగదహళ్ళిలోని దేవదుర్గ బంగారు ఖనిజ బ్లాక్ వ్యూ పాయింట్ నుంచి ఖనిజ అన్వేషణ చేపట్టనున్న ప్రాంతాలను ఉప ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడి బ్లాక్ నుంచి సింగరేణి అధికారులు సేకరించిన వివిధ రకాల ఖనిజ నమూనాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించబోయే బంగారం, రాగి వెలికితీత, అన్వేషణ ప్రక్రియల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరేణి అధికారులు కర్ణాటక రాష్ట్ర అధికార యంత్రాంగంతో డిప్యూటీ సీఎం సమీక్షా సమావేశం నిర్వహించి ఖనిజ అన్వేషణపై దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి పర్యటన ముగించుకుని లింగదహళ్ళి గ్రామంలోని చారిత్రక నేపథ్యం కలిగిన శ్రీ పరమానంద శివాలయాన్ని దర్శించుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, జిఎం పంకజ్ కుల శ్రేష్ట, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, సింగరేణి ఉన్నతాధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# జన గణలో కుల గణ చేపట్టాలి



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 28 :** చేపట్టాలిబీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారుడు పెద్దల వి హనుమంతరావు ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద, జనగణనలో కుల గణనను చేయాలని, బీసీలకు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ ధర్నాని నిర్వహించడం జరిగింది. ఈ యొక్క ధర్నాకు ఆల్ పార్టీ నాయకులు ,బీసీ సంఘ నాయకులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, మహిళా కాంగ్రెస్, జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు మద్దతు తెలుపుతూ భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా హనుమంతన్న మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం జన గణనలో కుల గణనను చేయకుండా బీసీలకు అన్యాయం చేస్తుందని వారు అన్నారు.




ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతా రోహిత్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ అన్నట్టు మేమెంత మాకంత అనే నినాదంతో దేశంలో జన గణన జరగాలని వారు అన్నారు. ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, ఇటు బీసీలకి 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో కూడా ఓబీసీ మహిళలకు అన్యాయం చేసింది ఈ మోదీ ప్రభుత్వం, ఒక బీసీ ప్రధాని అయి ఉండి



బీసీలకి అన్యాయం చేస్తున్న మోదీని గద్దె దించేలా, బీసీలం అందరము ఏకం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బాలగౌని బాలరాజ్ గౌడ్, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతా రోహిత్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, చైర్మన్లు సరిత తిరుపతయ్య, రేణుక, వైస్ చైర్మన్లు బోయ నగేష్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే జగదీష్ గౌడ్, పల్లె లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంథే-2026 ప్రారంభం.. విద్యార్థుల ప్రతిభకు జాతీయ స్థాయి వేదిక

- 16 ఏళ్లలో కోటి మందికి పైగా విద్యార్థుల నమోదు.. 100% వరకు స్కాలర్‌షిప్‌లు.. రూ.2.5 కోట్ల నగదు బహుమతులు

**భవిష్యత్ ప్రజా పాలన, హైద్రాబాద్ ప్రతినిధి, సీనియర్ జర్నలిస్ట్ అంజి,హైదరాబాద్, ఆగస్టు 26:** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు తమ సామర్థ్యాన్ని అర్థం చేసుకోవడంతో పాటు.. తమ బలాలు, బలహీనతలు, సన్నద్ధత స్థాయి, మెరుగుపరుచుకోవాల్సిన అంశాలను ముందు గానే గుర్తించేందుకు ఆకాశ్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్ (ANTHE)-2026 కీలక వేదికగా నిలుస్తోందని ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (AESL) తెలిపింది. ఈ నేపథ్యంలో ANTHE-2026ను సంస్థ ప్రారంభించింది. గత 16 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ ప్రతిభాన్వేషణ పరీక్షలో ఇప్పటివరకు 1 కోటి మందికి పైగా విద్యార్థులు నమోదు చేసుకున్నారు. దీంతో ూచీఎజు భారతదేశంలోనే అతిపెద్ద, అత్యంత సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న విద్యార్థి ప్రతిభాన్వేషణ, మూల్యాంకన వేదికల్లో ఒకటిగా నిలిచిందని AESL పేర్కొంది.

**కేవలం మార్కులు కాదు.. విద్యార్థి సామర్థ్యంపై సమగ్ర అంచనా**

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థికి ఏం చదవాలో తెలుసుకోవడం ఎంత ముఖ్యమో.. తాను ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నాడో తెలుసు కోవడం కూడా అంతే ముఖ్యమని ూజుూ తెలిపింది. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ూచీఎజును కేవలం మార్కులు, స్కోర్ లేదా ర్యాంక్ ఆధారిత పరీక్షగా కాకుండా.. విద్యార్థి సామర్థ్యాన్ని సమగ్రంగా అంచనా వేసే విధంగా రూపొందించినట్లు వెల్లడించింది. పరీక్షలోని




ప్రతి ప్రశ్నను ఒక నిర్దిష్ట ప్రయోజనంతో రూపొందిస్తారు. వివిధ సబ్జెక్టుల్లోని నిర్దిష్ట భావనలు, నైపుణ్యాలు, విద్యార్థి విశ్లేషణాత్మక సామర్థ్యాలను అంచనా వేయడానికి ప్రశ్నలు ఉపయోగపడతాయి. దీనివల్ల విద్యార్థి కేవలం ఎంత స్కోర్ సాధించాడనే అంశంతో పాటు.. ఏ అంశాల్లో బలంగా ఉన్నాడు, ఎక్కడ మెరుగుపడాలి, పోటీ పరీక్షలకు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాడు అనే విషయాలపై స్పష్టత పొందే అవకాశం ఉంటుంది.

**ANTHE Intelligence Report ప్రత్యేక ఆకర్షణ**

పరీక్ష అనంతరం విద్యార్థులకు ANTHE Intelligence Report అందించనున్నారు. ఈ నివేదిక ద్వారా విద్యార్థి సాధించిన స్కోర్‌కు మించి.. అతని విద్యా సామర్థ్యం, సబ్జెక్టుల వారీగా పనితీరు, పోటీ పరీక్షల సన్నద్ధత, పరీక్షను ఎదుర్కొనే విధానం వంటి అంశాలపై మరింత లోతైన అవగాహన కల్పించనున్నారు. విద్యార్థి ఏ సబ్జెక్టులో బలంగా ఉన్నాడు? ఏ అంశాలపై మరింత శ్రద్ధ అవసరం? పరీక్ష సమయంలో ప్రశ్నలను ఎలా ఎంచుకుంటు న్నాడు? ఖచ్చితత్వం, వేగం, రిస్క్ మధ్య ఎలా సమతుల్యత పాటిస్తున్నాడు? వంటి అంశాలను అర్థం చేసుకోవడానికి ఈ నివేదిక ఉపయోగపడుతుందని సంస్థ తెలిపింది. ఈ నివేదికలో Competitive Exam Success Potential (CESP), Test Taking Personality (TTP), Attempt Intelligence Quotient (AIQ) వంటి అంశాలను కూడా పరిశీలించనున్నారు.

**NEET, JEEలోనూ ANTHE విద్యార్థుల సత్తా**

జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన ఆకాష్ విద్యార్థులలో ూచీఎజు ద్వారా ముందుగానే అర్హత సాధించిన వారి సంఖ్య గణనీయంగా ఉందని AESL వెల్లడించింది. NEET UG-2026లో టాప్ 100 ర్యాంకులు సాధించిన 41 మంది ఆకాష్ విద్యార్థుల్లో 31 మంది గతంలో ూచీఎజు ద్వారా అర్హత సాధించినవారే అని సంస్థ తెలిపింది. అలాగే JEE Advanced-2026లో టాప్ 100లోపు ర్యాంకులు సాధించిన 11 మంది ఆకాష్ విద్యార్థుల్లో 7 మంది ూచీఎజు విద్యార్థులుగా ఉన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి, అందుకు అనుగుణంగా విద్యా ప్రణాళిక రూపొందించడం, సరైన మార్గదర్శకత్వం అందించడం పోటీ పరీక్షల సన్నద్ధతలో కీలక పాత్ర పోషిస్తుందని ఈ ఫలితాలు సూచిస్తున్నాయని AESL పేర్కొంది.

**'ANTHE కేవలం స్కాలర్‌షిప్ పరీక్ష కాదు"**

ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ చంద్రశేఖర్ గరిస రెడ్డి మాట్లాడుతూ.. ూచీఎజును కేవలం విద్యార్థికి స్కాలర్‌షిప్ అందించే పరీక్షగా మాత్రమే చూడకూడదన్నారు. సరైన మార్గదర్శకత్వం అందించగల కీలక దశలోనే విద్యార్థులు తమ విద్యాపరమైన సామర్థ్యాన్ని తామే అర్థం చేసుకునేలా చేయడం ANTHE ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గత 16 సంవత్సరాల్లో కోటి మందికి పైగా విద్యార్థులు తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకునేందుకు ANTHEను విశ్వసించారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థి సాధించిన మార్కులతో పాటు.. వారి బలాలు, సన్నద్ధత, మెరుగుపరుచుకోవాల్సిన అంశాలపై లోతైన అవగాహన కల్పించడమే పరీక్ష ప్రత్యేకత అని వివరించారు. ప్రతి విద్యార్థి ూచీఎజు ద్వారా తన విద్యా ప్రయాణంపై స్పష్టత పొందడంతో పాటు.. భవిష్యత్తులో సరైన మార్గాన్ని ఎంచుకునేలా అవసరమైన అవగాహన పొందాలనిఆయన ఆకాంక్షించారు.

**100 శాతం వరకు స్కాలర్‌షిప్‌లు**

ANTHE-2026లో ప్రతిభ కనబరిచిన అర్హులైన విద్యార్థులకు 100 శాతం వరకు స్కాలర్‌షిప్‌లు అందించనున్నారు. అంతేకాకుండా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం రూ. 2.5 కోట్ల నగదు బహుమతులు అందించనున్నట్లు AESL ప్రకటించింది. అర్హత ప్రమాణాలకు లోబడి విద్యార్థులు ఆకాష్ క్లాస్‌రూమ్, హైబ్రిడ్, డిజిటల్ ప్రోగ్రామ్‌లకు స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం ఉంటుంది.

# శ్రావణ (రాఖీ) పౌర్ణమి సందర్భంగా రామాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు...







- రామాలయ అన్నప్రసాద కమిటీ వారిచే భక్తులకు అన్నప్రసాద పంపిణీ ..
- రామాలయ ప్రధాన అర్చకులు కందడై వరదరాజన్ అయ్యంగార్...

**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** శ్రావణ మాసం రాఖీపౌర్ణమి సందర్భంగా శుక్రవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ కాలనీలో గల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో భక్తులచే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించినట్లు రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పౌర్ణమి రోజు విష్ణు స్వరూపమైన సీతారామచంద్ర స్వామి వారి సన్నిధిలో వ్రతాలు చేయడం, సూక్ష్మంలో మోక్షమార్గం పొందుటకు సులువైన మార్గమని తెలిపారు. రామాలయంలో భక్తులచే సామూహికంగా 12 మంది జంటలచే వ్రతాలు నిర్వహించి, అనంతరం తీర్థ ప్రసాదాల పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి నెల పౌర్ణమికి సామూహికంగా వ్రతాలు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు.పాల్గొన్న భక్తులందరికీ అన్న ప్రసాద పంపిణీ చేశారు.వివిధ ప్రాంతాల నుండి 450 మందిభక్తులు పాల్గొన్నరాని తెలిపారు. రామాలయ భజన మండలి,నిత్య విష్ణు సహస్ర పారాయణ కమిటీ సభ్యులచే ప్రత్యేక భజనలు చేశారు.ఈ కార్యక్రమంలో కందాడై శ్రీనివాసచార్యులు, కరుణశ్రీ, అర్థం రవీందర్, మల్లేష్, గొల్ల రాములు, రమాదేవి, శారద, భక్తుల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బంజారా సంస్కృతి.. సంప్రదాయాలకు ప్రతీక తీజ్ ఉత్సవాలు




- బడంగ్‌పేట్‌లో ఘనంగా బంజారా తీజ్ వేడుకలు
- ఆకట్టుకోనున్న సంప్రదాయ నృత్యాలు.. జానపద గీతాలు
- తరతరాలుగా వస్తున్న ఆచారాలను కాపాడు కునేందుకు బంజారా సమాజం సంకల్పం

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన :** గిరిజన బంజారా సమాజం సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే ప్రతిష్ఠాత్మకమైన తీజ్ ఉత్సవాలకు బడంగ్‌పేట్ వేదిక కానుంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల పరిధిలోని బడంగ్‌పేట్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ (బి.బి.డబ్ల్యు.ఏ) ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. బంజారా సమాజానికి చెందిన మహిళలు, యువతులు, చిన్నారులు, యువకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంప్రదాయాలను చాటిచెప్పేందుకు సిద్ధమవుతున్నారు. బంజారా జీవన విధానంలో తీజ్ పండుగకు ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉంది. ప్రకృతిని ఆరాధిస్తూ, పచ్చదనాన్ని కాంక్షిస్తూ, కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సమాజ అభివృద్ధిని కోరుకుంటూ మహిళలు భక్తిశ్రద్ధలతో తీజ్ వేడుకలను నిర్వహించడం బంజారా సమాజం లో అనాదిగా వస్తున్న సంప్రదాయం. తరతరాలుగా కొనసాగుతున్న ఈ పండుగ నేటి ఆధునిక సమాజంలోనూ అదే ఉత్సాహం తో కొనసాగుతుండటం బంజారా సంస్కృతి గొప్పతనానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**సంప్రదాయాల పరిరక్షణకు పెద్దపీ**

బడంగ్‌పేట్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తీజ్ ఉత్సవాల్లో బంజారా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.ముఖ్యంగా బంజారా మహిళలు, యువతులు సంప్రదాయ లంబాడీ వస్త్రధారణలో హాజరై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. రంగురంగుల సంప్రదాయ దుస్తులు.. అద్దాల కళతో కూడిన వస్త్రధారణ.. వెండి ఆభరణాలు.. సంప్రదాయ నగలు.. జానపద గీతాలు.. నృత్యాలు తీజ్ ఉత్సవాల ప్రత్యేకతగా నిలవనున్నాయి. బంజారా మహిళలు సమూహాలుగా చేరి సంప్రదాయ పాటలు పాడుతూ,నృత్యాలు చేస్తూ పండుగకు మరింత శోభను తీసుకురానున్నారు.

**'స్వాగతం.. సుస్వాగతం'**

బడంగ్‌పేట్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చే బంజారా కుటుంబాలకు, సమాజ పెద్దలకు, మహిళలకు, యువతకు, చిన్నారులకు, బంధుమిత్రులకు తీజ్ ఉత్సవాలకు 'స్వాగతం.. సుస్వాగతం' అంటూ నిర్వాహకులు ఆహ్వానం పలుకుతున్నారు. బంజారా సమాజానికి చెందిన ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా తీజ్ పండుగ ప్రాముఖ్యతను యువతరానికి వివరించడంతో పాటు, బంజారా సమాజం యొక్క ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, కళలు, జానపద గీతాలు, నృత్యాలను భావితరాలకు పరిచయం చేయడమే ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు పేర్కొంటున్నారు.




**మహిళలదే కీలక పాత్ర**

తీజ్ పండుగలో బంజారా మహిళల పాత్ర అత్యంత కీలకం. పండుగకు ముందుగానే తీజ్ మొక్కలను ప్రత్యేకంగా పెంచి, వాటిని భక్తిశ్రద్ధలతో సంరక్షిస్తూ,పూజలు నిర్వహిస్తారు. అనంతరం సంప్రదాయ పద్ధతుల్లో వేడుకలను నిర్వహిస్తూ కుటుంబ సభ్యులు, సమాజం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తారు. తీజ్ వేడుకల సందర్భంగా మహిళలు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఆనందాన్ని పంచుకోవడం బంజారా సంస్కృతిలో కనిపించే ప్రత్యేకమైన సంప్రదాయం. ఈ సంప్రదాయం బంజారా మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తోంది.

**యువతలో సంప్రదాయాలపై అవగాహన**

ప్రస్తుత ఆధునిక జీవన విధానంలో పాశ్చాత్య సంస్కృతి ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో తమ మూలాలను, పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆచారాలను మరచిపోకుండా భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని బంజారా సమాజ పెద్దలు పేర్కొంటున్నారు. తీజ్ వంటి పండుగలు కేవలం వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా బంజారా జాతి చరిత్ర, సంస్కృతి, ఆచారాలు, ఐక్యతను ప్రతిబింబించే వేదికలుగా నిలుస్తున్నాయని తెలిపారు. యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా వారిలో తమ సంస్కృతిపై గర్వభావన పెంపొందుతుందని పేర్కొన్నారు.

**ఐక్యతకు ప్రతీకగా తీజ్ వేడుకలు**

బడంగ్‌పేట్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తీజ్ ఉత్సవాలు బంజారా సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలవనున్నాయి. బంజారా కుటుంబాలన్నీ ఒకే వేదికపైకి చేరి సోదరభావంతో పండుగను జరుపుకోవడంతో పాటు, తమ సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పేందుకు సిద్ధమవుతు న్నారు. "మన సంస్కృతి.. మన సంప్రదాయం.. మన ఆచారం.. మన బంజారా గర్వం" అనే స్ఫూర్తితో తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిం చేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో బంజారా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించనున్న ఈ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. బంజారా సమాజానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తీజ్ ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో పరామర్శించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క





**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 28 :** గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్‌ని ఈరోజు సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

# కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు





- కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు
- మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది: బండి రమేష్

**భవిష్యత్ ప్రజాపాలన, రిపోర్టర్: శివయ్య కూకట్‌పల్లి, ఆగస్టు 28, 2026:** కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలను పార్టీ నాయకులు,మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గం



లోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బండి రమేష్ గారికి మహిళా నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ గారు మహిళలకు రక్షాబంధన్ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, మహిళల పట్ల గౌరవం, ఆప్యాయత, రక్షణ భావన సమాజంలో మరింత బలపడాలని ఆకాంక్షించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలిచి, ఆత్మవిశ్వాసంతో తమ లక్ష్యాలను సాధించాలని ఆయన అన్నారు. మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బండి రమేష్ గారు పేర్కొన్నారు. మహిళల విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక భద్రత వంటి అంశాల్లో వారికి అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. మహిళలకు ఎలాంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే, సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే పార్టీలకు అతీతంగా మహిళల సంక్షేమం కోసం పనిచేస్తానని బండి రమేష్ గారు స్పష్టం చేశారు. మహిళలు కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడంతో పాటు సమాజ నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి కృషి అభినందనీయమని అన్నారు. మహిళలు రాజకీయాలు, విద్య, ఉద్యోగం, వ్యాపారం, క్రీడలు, సామాజిక సేవ తదితర అన్ని రంగాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాఖీలు కట్టిన మహిళలను బండి రమేష్ గారు ఆత్మీయంగా పలకరించి, వారి ఆశీస్సులు స్వీకరించారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ రక్షాబంధన్ సందర్భంగా బండి రమేష్ గారికి రాఖీలు కట్టడం ఎంతో సంతోషంగా ఉందని, మహిళల సమస్యలపై ఆయన ఎల్లప్పుడూ స్పందిస్తూ అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పరస్పరం రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్లు, బ్లాక్ మహిళా నాయకులు, డివిజన్ నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాఖీ బంధం.. ఆత్మీయతకు ప్రతిరూపం!

- పృథ్వీరాజ్‌కు రాఖీలు కట్టిన సోదరీమణులు
- రక్షాబంధన్ వేడుకల్లో ఘనంగా పాల్గొన్న ఎండీర్ ఫౌండేషన్ కో-ఫౌండర్



**పటాన్‌చెరు:ఆగష్టు28:** అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు పటాన్‌చెరులో ఉత్సాహంగా సాగాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన సోదరీమణులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎండీర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రాఖీలు కట్టారు. సోదరీమణులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేయగా.. పృథ్వీరాజ్ వారిని ఆత్మీయంగా పలకరిస్తూ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణం సోదర-సోదరీమణుల ఆత్మీయతతో సందడిగా మారింది.

**బంధాలకు బలం.. ఆత్మీయతకు అర్థం**

రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టే పండుగ మాత్రమే కాదని, సోదర-సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, విశ్వాసం, పరస్పర బాధ్యతలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని పృథ్వీరాజ్ పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తూ, ప్రతి ఒక్కరిలో ఆత్మీయత, అనురాగాన్ని పెంపొందించే గొప్ప సంప్రదాయమే రక్షాబంధన్ అని అన్నారు. సోదరీమణులు తనపై చూపిన ఆప్యాయత, అభిమానానికి పృథ్వీరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి అక్కాచెల్లెలి జీవితంలో ఆనందం, ఆరోగ్యం, సంతోషం నిండాలని ఆకాంక్షించారు.



**నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు**

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలందరికీ మాద్రి పృథ్వీరాజ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆప్యాయతలు వెల్లివిరిసి, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాఖీ వేడుకల్లో సోదరీమణులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న పామేన భీమ్ భరత్



**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి - ఆగస్టు 28, చేవెళ్ల నియోజకవర్గం:** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ అన్నారు. నవాబుపేట మండలం ఏళ్లకొండ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడంతో శుక్రవారం నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని అన్నారు. ఇల్లు నిర్మాణం పూర్తిచేసుకుని లబ్ధిదారులు నూతన గృహంలోకి అడుగుపెట్టడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి చేవెళ్ల నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు శంకర్‌పల్లి మండలం లక్ష్మారెడ్డిగూడ గ్రామ ఉపసర్పంచ్ ఇంద్రారెడ్డి వివాహ వేడుకలో భీమ్ భరత్ పాల్గొన్నారు. గురువారం మునగాల సుధాకర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ కార్యక్రమానికి చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్ రెడ్డితో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఏళ్లకొండలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో నవాబుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సామ వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకటయ్య, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, ఏళ్లకొండ సర్పంచ్ కొండల్ యాదవ్, ఉపసర్పంచ్ రామ్ చందర్, పులుమామిడి సర్పంచ్ నరసింహులు, నరేగూడ సర్పంచ్ దీపికా దశరథ్, ముబారక్‌పూర్ సర్పంచ్ జమ జయయ్య, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ శేఖర్, యువజన కాంగ్రెస్ నాయకుడు దయానంద్ గౌడ్, ఏళ్లకొండ గ్రామ వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కుమ్మరి శివ, గ్రామ పెద్దలు, యువకులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా దంపనబోయిన శ్రీనివాస్ కుమార్తె వివాహ వేడుక

- ఘనంగా దంపనబోయిన శ్రీనివాస్ కుమార్తె వివాహ వేడుక
- నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు, బంధువులు, మిత్రులు



**భవిష్యత్ ప్రజా పాలన, హైదరాబాద్ ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 27:** హైదరాబాద్ జంట నగరాల శెట్టిబలిజ సంఘం (YFCA) అధ్యక్షులు దంపనబోయిన శ్రీనివాస్-శ్రీమతి రూప దంపతుల ఏకైక కుమార్తె చి. తేజస్విని వివాహం వేణుగోపాల్తో గురువారం ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని గాజులరామారం-బాలాజీ లేఔట్‌లో ఉన్న KVS కన్వెన్షన్ వేదికగా ఉదయం 11.07 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణలు, బంధుమిత్రుల సందడి మధ్య వివాహ వేడుక అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివాహ కార్యక్రమానికి హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శెట్టిబలిజ సోదరులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ముఖ్యంగా మల్లారెడ్డి కాలనీ, యండమూరి లేఔట్, ద్వారకానగర్, మహదేవపురం, దేవేందర్‌నగర్, గాజులరామారం, మోతీనగర్ తదితర ప్రాంతాల నుంచి పలువురు తరలివచ్చి వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

**వేద పండితుల ఆశీర్వచనాల మధ్య వివాహం**

వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ తేజస్విని-వేణుగోపాల్ వివాహ వేడుక సంప్రదాయబద్ధంగా జరిగింది. వధూవరుల కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు అందించారు. వివాహ వేదిక వద్ద సందడి వాతావరణం నెలకొంది. వివాహానికి వచ్చిన అతిథులకు కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. వివాహ వేడుక సందర్భంగా పలువురు ప్రముఖులు నూతన దంపతులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

**FCA టీమ్ సభ్యుల హాజరు**

హైదరాబాద్ జంట నగరాల శెట్టిబలిజ సంఘం (YFCA)కు చెందిన పలువురు ప్రతినిధులు, టీమ్ సభ్యులు ఈ వివాహ వేడుకలో పాల్గొన్నారు. పెచ్చెట్టి దేవేంద్రరావు, చెల్లుబోయిన ప్రసాద్, ఖూదీ కుమార్, పితాని శ్రీనివాస్, కుడుపూడి శ్రీనివాసరావు, దొంగ శ్రీనివాస్, యంద్ర లోకేష్, గుబ్బల రమణ, చిట్టూరి సుబ్రహ్మణ్యం, పీవీవీ సత్యనారాయణ, చింతపల్లి దుర్గా ప్రసాద్, కడలి విజయ్ భాస్కర్, వాసంశెట్టి శ్రీనివాస్, మల్లుల శ్రీనివాసరావు, పంపన సత్యనారాయణ, గూడూరి త్రినాథ్, వేంద్ర చలపతిరావు, రాయుడు గణపతి, కుడుపూడి భాస్కర్, లక్ష్మారెడ్డి తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

**పలువురు రాజకీయ ప్రముఖుల హాజరు**

ఈ వివాహ వేడుకకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తదితరులు వివాహ వేడుకకు హాజరయ్యారు. అలాగే హైదరాబాద్ నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలువుల జగన్, సూరారం కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మంత్రి సత్యనారాయణ తదితరులు వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

**ఆత్మీయంగా పలకరించుకున్న కుటుంబ సభ్యులు**

వివాహ వేడుక సందర్భంగా దంపనబోయిన శ్రీనివాస్-రూప దంపతుల కుటుంబ సభ్యులను పలువురు ప్రముఖులు, బంధువులు, స్నేహితులు కలిసి అభినందించారు. వివాహానికి విచ్చేసిన అతిథులతో కుటుంబ సభ్యులు ఆత్మీయంగా మాట్లాడి వారి రాకకు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో శెట్టిబలిజ కుటుంబాలు తరలిరావడంతో KVS కన్వెన్షన్‌లో సందడి నెలకొంది. నూతన వధూవరులతో ఫొటోలు దిగుతూ పలువురు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

**నూతన దంపతులకు శుభాకాంక్షలు**

వివాహ వేడుకకు హాజరైన ప్రముఖులు, YFCA ప్రతినిధులు, బంధువులు, మిత్రులు, శెట్టిబలిజ సంఘం సభ్యులు నూతన వధూవరులు తేజస్విని--వేణుగోపాల్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం, పరస్పర ప్రేమానురాగాలతో సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. దంపనబోయిన శ్రీనివాస్-రూప దంపతుల కుమార్తె వివాహ వేడుకకు ఇంత పెద్ద సంఖ్యలో బంధుమిత్రులు, సంఘం ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# దేవదుర్గ బంగారం-రాగి బ్లాక్‌లో

## ఖనిజ అన్వేషణ పనులను వేగవంతం చేయాలి





- సింగరేణి అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 28 :** దేవదుర్గ బంగారం-రాగి బ్లాక్‌లో ఖనిజ అన్వేషణ పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు సింగరేణి వేలంలో దక్కించుకున్న దేవదుర్గ బంగారం--రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్ హట్టి గోల్డ్ మైన్స్‌కు సమీపంలో ఉండటం గొప్ప అవకాశమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హట్టి సంస్థ సాంకేతిక అనుభవాన్ని దేవదుర్గ ప్రాజెక్టులో వినియోగించుకోవాలన్నారు. దేవదుర్గలో ఖనిజ నిక్షేపాల పరిమాణం, నాణ్యతను నిర్ధారించేందుకు ఆధునిక సాంకేతిక పద్ధతులతో అన్వేషణను వేగవంతం చేయాలని సూచించారు. ఆశాజనక ఫలితాలు వచ్చిన వెంటనే తదుపరి దశలో చేపట్టే అంశాలపై ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.దేవదుర్గలో ఏర్పాటు చేయనున్న సింగరేణి సైట్ కార్యాలయాన్ని త్వరలో ప్రారంభించడానికి కావలసిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎండీని ఆదేశించారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ, యెమ్మూరప్ప గౌడ రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్ దఫేదార్ పాల్గొన్నారు.





# ఘనంగా రక్షా బంధన్ వేడుకలు....

**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** రక్తసంబంధం అంటేనే ఆత్మీయతకు ప్రతీక...అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రక్షాబంధన్ పండుగ ఓ మధురమైన జ్ఞాపకం. విధి నిర్వహణలో ఉన్న అన్నను కలిసిన చెల్లెలు... బస్సులోనే రాఖీ కట్టి తన ప్రేమను చాటుకుంది. రక్షాబంధన్ సందర్భంగా ఓ చెల్లెలు తన అన్నకు రాఖీ కట్టిన అపురూప దృశ్యం ఇది. ప్రజల రాకపోకలకు సేవలందిస్తూ RTC విధుల్లో ఉన్న అన్నను కలిసిన చెల్లెలు... బస్సులోనే రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటుకుంది. విధి నిర్వహణే తన బాధ్యతగా భావిస్తూ పండుగ రోజున కూడా డ్యూటీలో ఉన్న అన్నకు... చెల్లెలు రాఖీ కట్టి, తీపి జ్ఞాపకాన్ని అందించింది. "అన్న ఎక్కడ ఉన్నా... ఏ పరిస్థితుల్లో ఉన్నా... చెల్లెలి ప్రేమ, రాఖీ బంధం ఎప్పటికీ తోడుగా ఉంటాయి" అన్నట్టుగా సాగిన ఈ దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. ప్రజల సేవలో ఉండే RTC సిబ్బందికి పండుగ రోజుల్లో కూడా విధులే ముందుంటాయి. అలాంటి సమయంలో చెల్లెలు స్వయంగా వచ్చి రాఖీ కట్టడంతో...అన్నకుకూడా ఈ రక్షాబంధన్ మరింత ప్రత్యేకంగా మారింది.

**అన్నకు రాఖీ... చెల్లెలి ఆత్మీయత...** విధి మధ్యలోనూ బంధానికి విలువనిచ్చిన ఈ అన్నాచెల్లెళ్ల అనుబంధం...నిజంగా రక్షా బంధన్ పండుగకు ఓఅందమైన జ్ఞాపకం.





శనివారం , ఆగస్టు 29 , 2026
భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



## ఖమ్మం బాలికను పరామర్శించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 28 :** ఖమ్మం జిల్లాలో దారుణ ఘటనకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి, అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. బాలికకు మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి వారికి ధైర్యం చెప్పారు. బాలికకు న్యాయం బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. సంఘటన జరిగిన అనంతరం ఆ బాలిక ఆసుపత్రిలో అడ్మిట్ అయినప్పటి నుంచి ఎప్పటికప్పుడు ఆ బాలిక ఆరోగ్యపరిస్థితిని పర్యవేక్షించడం తోపాటు కుటుంబ సభ్యుల బాగోగులను కూడా తెలుసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి వేడుకలు

- **కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువుల సమక్షంలో ఘనంగా వేడుకలు**
- **ప్రతి ఏటా అక్కాచెల్లెళ్లకు చీరలు.. అన్నదమ్ములకు రాఖీలు కట్టడం ఆనవాయితీగా కొనసాగిస్తున్న ఆంగోత్ రాజు నాయక్ కుటుంబం**



**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన :** అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలను మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆంగోత్ రాజు



నాయక్ కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులు, అక్కాచెల్లెళ్లు, కూతుళ్లు, ఇతర కుటుంబ బంధువులతో కలిసి ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా రాఖీ పౌర్ణమి సందర్భంగా భారీ ఎత్తున కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయులు ఒకచోట చేరి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా అక్కాచెల్లెళ్లు, కూతుళ్లు, కుటుంబంలోని మహిళా బంధువులు ఎంతో ఆప్యాయంగా అన్నదమ్ములకు రాఖీలు కట్టి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ఆకాంక్షించారు. అన్నదమ్ములు కూడా తమ సోదరీమణులపై ఉన్న ప్రేమాభిమానాలను చాటుకుంటూ వారికి మంచి మంచి చీరలను బహుమతులుగా అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. రాఖీ పండుగను కేవలం ఒకరోజు జరిగే కార్యక్రమంగా కాకుండా కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఆత్మీయ వేడుకగా రాజు నాయక్ కుటుంబం ప్రతి సంవత్సరం నిర్వహిస్తోంది. పుట్టింటి బంధాలను గుర్తు చేసుకుంటూ అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు ఒకచోట చేరడం, పరస్పరం ఆత్మీయంగా పలకరించుకోవడం, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకోవడంతో కుటుంబం లో పండుగ వాతావరణం నెలకొంది.

**చీరలతో సోదరీమణులకు ఆత్మీయ కానుక**

ప్రతి సంవత్సరం రాఖీ పౌర్ణమి సందర్భంగా అక్కాచెల్లెళ్లకు ప్రత్యేకంగా చీరలు అందజేయడం ఈ కుటుంబంలో ప్రత్యేకతగా నిలుస్తోంది. ఈ ఏడాది కూడా కుటుంబంలోని అక్కాచెల్లెళ్లు, కూతుళ్లు, మహిళా బంధువులకు చీరలను అందజేసి వారిపై ఉన్న ప్రేమాభిమానాలను చాటుకున్నారు. రాఖీలు కట్టిన అనంతరం సోదరులు తమ సోదరీమణుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులు భారీ సంఖ్యలో పాల్గొనడంతో వేడుకలు మరింత సందడిగా మారాయి. ఒకరినొకరు రాఖీలు కట్టుకుంటూ, మిఠాయిలు తినిపించుకుంటూ, శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందంగా గడిపారు. చిన్నారులు, కూతుళ్లు, యువతులు, పెద్దలు ఇలా అన్ని వయసుల వారు వేడుకల్లో పాల్గొనడంతో కుటుంబ సమ్మేళనాన్ని తలపించింది.

**బంధాలను బలపరిచే పండుగ**

రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, నమ్మకం, రక్షణ, ఆప్యాయతలకు ప్రతీక అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. మారుతున్న కాలంలో కుటుంబ సభ్యులు, బంధువులు అందరూ ఒకచోట కలుసుకోవడం అరుదవుతున్న నేపథ్యంలో ఇలాంటి పండుగలు కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయని తెలిపారు. ప్రతి సంవత్సరం రాఖీ పౌర్ణమిని కుటుంబ సభ్యులు, అక్కాచెల్లెళ్లు, బంధువులు, మిత్రుల సమక్షంలో నిర్వహిస్తూ వస్తున్నామని ఆంగోత్ రాజు నాయక్ తెలిపారు. చిన్ననాటి నుంచి కొనసాగుతున్న అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని భవిష్యత్ తరాలకు కూడా అందించాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను కుటుంబ సమేతంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**ఆత్మీయతకు చిరునామాగా కుటుంబ వేడుక**

రాఖీ పౌర్ణమి సందర్భంగా కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరడంతో ఇంటిల్లిపాది సందడిగా మారింది. అక్కాచెల్లెళ్లకు చీరలు అందజేయడం, అన్నదమ్ములకు రాఖీలు కట్టడం, పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవడం, చిన్నారులతో కలిసి ఆనందంగా గడపడం వంటి కార్యక్రమాలతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ ప్రజలతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, బంధువులు, అభిమానులకు ఆంగోత్ రాజు నాయక్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతలు మరింత పెరగాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

## భక్తి కార్యక్రమానికి భారీ విరాళం!

### గాంధీనగర్ తొట్టెల జాతరకు BRS నేత భిల్యానాయక్ చేయూత - రూ.10,000 విరాళం



- **దేవరకొండలో 29న అంగరంగ వైభవంగా తొట్టెల ఊరేగింపు**

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వర్ద్య :** దేవరకొండ పట్టణంలోని 20వ వార్డు గాంధీనగర్‌లో ఈ నెల 29న జరగనున్న తొట్టెల ఊరేగింపు కార్యక్రమానికి BRS రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ రూ.10,000 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, గాంధీనగర్ యూత్ ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. భక్తి శ్రద్ధలతో జరిగే ఈ కార్యక్రమానికి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని భీల్యానాయక్ తెలిపారు. కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం





- **మైలార్ బాయి తండాలో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం**
- **గంగారం గ్రామపంచాయతీని అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలి: సర్పంచ్ మునావత్ దేవేందర్ నాయక్**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన :** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని గంగారం గ్రామ సర్పంచ్ మునావత్ దేవేందర్ నాయక్ అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంత ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు. శుక్రవారం గంగారం గ్రామపంచాయతీ పరిధిలోని మైలార్ బాయి తండాలో మునావత్ మంజుల-మల్లేష్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారం గ్రామ సర్పంచ్ మునావత్ దేవేందర్ నాయక్ నూతన ఇంటి వద్ద రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన గృహంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడం కేవలం ఒక నిర్మాణ కార్యక్రమం కాదని, ఆ కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై భరోసా కల్పించడమేనని అన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, బడుగు బలహీన వర్గాలు, అర్హులైన నిరుపేద కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. “గుడిసెలు లేని కుటుంబాలు, సొంత ఇల్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది” అని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం లభిస్తోందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరేలా గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా ఇల్లు లేని పేద కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రయోజనం పొందాలని సూచించారు. గంగారం గ్రామపంచాయతీని మహేశ్వరం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముందంజలో నిలపాలన్నదే తమ లక్ష్యమని దేవేందర్ నాయక్ తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, రహదారులు, తాగునీరు తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. గంగారం గ్రామపంచాయతీలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామ ప్రజల సహకారంతో గంగారం గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి, ప్రజా సంక్షేమం--గ్రామాభివృద్ధి సమన్వయంతో ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు పూర్తికావడంతో మునావత్ మంజుల--మల్లేష్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారంతో తమ సొంతింటి కల నెరవేరిందని, నూతన ఇంటిలో గృహప్రవేశం చేయడం తమ కుటుంబానికి మరపురాని రోజని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గంగారం గ్రామ ఉపసర్పంచ్ అల్వాల మహేందర్, మాజీ ఉపసర్పంచ్ కేతావత్ సూర్య నాయక్, వార్డు సభ్యులు ఎం. దేవ, ఎం. రవి, ఎం. జ్యోతి, గోపి, ధర్మ, శ్రీనివాస్, తులసి, లచ్చ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు హాజరై నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసనలకు సన్నాహాలు



- **చేవెళ్లలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం.. హాజరుకానున్న సబితా ఇంద్రారెడ్డి**
- **కాంగ్రెస్ పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణపై చర్చ**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి - ఆగస్టు 28, చేవెళ్ల నియోజకవర్గం :** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనకు నిరసనగా నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించేందుకు చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం సాయంత్రం 3 గంటలకు చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపల్లి గేట్ వద్ద గల అట్లాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ సమావేశానికి చేవెళ్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఎదురైన సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు భవిష్యత్‌లో చేపట్టాల్సిన నిరసన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నారు. బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం వంటి అంశాలపై కూడా ముఖ్య కార్యకర్తలతో చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ ఉద్యమ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థల నాయకులు, పార్టీ శ్రేణులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## ఓటు హక్కు భద్రం.. అప్రమత్తమైన వార్డు 5!



- **బూత్ నెం. 97లో ఓటర్ల జాబితా సవరణపై అవగాహన సదస్సు**
- **13లో 3 పత్రాలు తప్పనిసరి: ఓటర్లకు కౌన్సిలర్ శ్రీకన్యా సూచన**

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వర్ద్య :** మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నంబర్ 5, బూత్ నంబర్ 97 పరిధిలో గురువారం ఓటర్ల జాబితా సవరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. BLO రాము గారు మరియు RP గాయత్రీ గారి ఆధ్వర్యంలో నోటీసులు అందుకున్న ఓటర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జాబితా సవరణ, అర్హతలు, పత్రాల సమర్పణపై ఓటర్లకు వివరంగా వివరించారు. సెప్టెంబర్ 16వ తేదీన నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు ప్రభుత్వం సూచించిన 13 రకాల గుర్తింపు పత్రాలలో ఏవైనా 3పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 5వ వార్డు కౌన్సిలర్ శ్రీకన్యా సేవ్యా నాయక్ గారు హాజరై ఓటర్లకు అవసరమైన సూచనలు చేశారు. ఓటు హక్కును కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ఈ సవరణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## పాలకుర్తిలో ఘనంగా జంధ్యాల పౌర్ణమి వేడుకలు





**భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి:** జంజిరాల పౌర్ణమి (నూలు పోగు పౌర్ణమి) సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో పట్టణ పద్మశాలిల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్త మార్కండేయ మహర్షికి సమర్పించే పట్టు వస్త్రాలను కుల పెద్ద చిలుకమారి ఉప్పలయ్య ఇంటి నుంచి బ్యాండ్ మేళాలతో గుడివాడ చౌరస్తాలోని ఓంకారేశ్వర ఆలయం (పంచగుళ్ల) వరకు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం ఆలయ అర్చకులు గంగు రఘు శర్మ ఆధ్వర్యంలో శ్రీ భక్త మార్కండేయ స్వామివారికి పంచామృతాభిషేకం, గణపతి హోమం, యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాలను నిర్వహించారు. పద్మశాలిలు జంజిరాలను యజ్ఞోపవీత ధారణ చేసి, గాయత్రీ మంత్రోచ్చారణ, షోడశోపచార పూజలు, మార్కండేయ స్వామి పూజల అనంతరం భక్తిశ్రద్ధలతో ధరించారు. నూలు పోగు ఉద్భవించిన పవిత్రమైన నూలు పౌర్ణమి, రక్షాబంధన్ పర్వదినాన్ని పాలకుర్తి పట్టణ పద్మశాలిలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు చిలుకమారి వెంకటేశ్వర్లు, పోపా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిదురాల ఎల్లయ్య, సలహాదారులు మాజీ ఉప సర్పంచ్ కాటబత్తిని రమేష్, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్, చేనేత ఐక్య వేదిక మండల ప్రధాన కార్యదర్శి చిలుకమారి సోమేశ్వర్, ప్రముఖ జర్నలిస్టు మార్గం లక్ష్మీనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి చిదురాల మార్కండేయ తదితర పద్మశాలి సంఘ నాయకులు, కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాఖీ పౌర్ణమితో చేవెళ్ల నియోజకవర్గంలో పండుగ శోభ



- **చిన్నా పెద్దా తేడా లేకుండా రాఖీలతో వెల్లివిరిసిన ఆప్యాయత.. మిఠాయిలు పంచుకుంటూ ఆనందోత్సాహాలు**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి- ఆగస్టు 28, చేవెళ్ల నియోజకవర్గం :** చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాల్లో రాఖీ పౌర్ణమి పండుగను ప్రజలు ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు, సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించగా, అన్నదమ్ములు సైతం తమ సోదరీమణులకు ఆప్యాయంగా బహుమతులు అందించి ప్రేమాభిమానాలను చాటుకున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ రాఖీ పండుగలో ఉత్సాహంగా పాల్గొని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ముఖ్యంగా చిన్నారులు రాఖీలు కట్టించుకుంటూ, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సందడి చేయడం పండుగకు మరింత శోభను తీసుకొచ్చింది. పెద్దలు కూడా తమ సోదర సోదరీమణులతో ఆత్మీయంగా రాఖీ పండుగను జరుపుకుంటూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రతి ఇంటా రాఖీల సందడి, మిఠాయిల పంచకం, ఆప్యాయ పలకరింపులతో పండుగ వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి సంతోషాన్ని పంచుకోవడంతో గ్రామాల్లో ఎటుచూసినా చిరునవ్వులు, ఆనందోత్సాహాలు కనిపించాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు, సోదర సోదరీమణుల మధ్య ప్రేమానుబంధాలను మరింత బలపరిచే రాఖీ పౌర్ణమిని చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు చిన్నా పెద్దా అందరూ సమన్వయంతో, సంతోషంగా జరుపుకున్నారు. ఈ ప్రత్యేకమైన రోజు ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచి మధుర జ్ఞాపకాలను మిగిల్చింది.



Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

# ఇందిరమ్మ టవర్స్‌తో మధ్యతరగతి కుటుంబానికి సొంతింటి కల

**రంగారెడ్డి జిల్లా, భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ జర్నలిస్ట్ వినోద్ కుమార్:** ఇందిరమ్మ టవర్స్‌తో పేదల సొంతింటి కల సాకారం - రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రాజేంద్రనగర్ నియోజకవర్గం లక్ష్మీగూడలోని లక్ష్మీ భవనం-పొదుపు సంఘం హాల్‌లో శుక్రవారం నిర్వహించిన క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లక్కీ డ్రా కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పేద కుటుంబాలకు శాశ్వతమైన, నాణ్యమైన ఇళ్లను ఉచితంగా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 4.50 లక్షల ఇళ్లు, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో పట్టణ పేదల కోసం ప్రత్యేకంగా లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని, తొలి దశ పైలట్ ప్రాజెక్టుగా నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయని చెప్పారు. త్వరలో మరో నాలుగు నియోజకవర్గాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తామని వెల్లడించారు.




ఇందిరమ్మ టవర్స్‌లో ఒక్కో ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని మంత్రి తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఇంటి విలువ సుమారు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఉంటుందని, ఇందులో భూమి విలువ సుమారు రూ.50--60 లక్షలు, నిర్మాణ వ్యయం సుమారు రూ.10-15 లక్షలు ఉంటుందని వివరించారు. ఇంత విలువైన ఇంటిని పేద కుటుంబాలకు ఎటువంటి ఖర్చు లేకుండా ప్రభుత్వం అందిస్తోందన్నారు. లబ్ధిదారుల కుటుంబంలోని మహిళ పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇతర ఛార్జీలను కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. గతంలో పేదలకు ఇళ్లు కేటాయించే సమయంలో వారి నివాస ప్రాంతాలకు 30--40 కిలో మీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల ఉపాధి, పిల్లల చదువులు, స్థానిక సామాజిక సంబంధాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలోనే లేదా సమీప ప్రాంతంలోనే ఇళ్లను నిర్మించి అందించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరుగుతుందని మంత్రి తెలిపారు. రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తూ బహిరంగ లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేపడుతున్నామని చెప్పారు. లక్కీ డ్రాలో పేరు వచ్చినంత మాత్రాన తుది కేటాయింపు జరిగినట్లు కాదని స్పష్టం చేశారు. అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భౌతికంగా పరిశీలించి, పత్రాలు మరియు అర్హతలను ధ్రువీకరించిన అనంతరం తుది ఎంపిక, కేటాయింపు జరుగుతుందని తెలిపారు. మొదటి విడత లక్కీ డ్రాలో ఇల్లు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని మంత్రి అన్నారు. భవిష్యత్‌లో మరింత ప్రభుత్వ భూమిని సమీకరించి ఇళ్ల నిర్మాణాన్ని విస్తరించినప్పుడు మిగిలిన అర్హులైన దరఖాస్తుదారులను తదుపరి విడతల్లో పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఒకసారి లక్కీ డ్రాలో పేరు రాకపోయిందని దరఖాస్తు ముగిసిపోయినట్లు కాదని, అర్హులైన వారికి తదుపరి దశల్లో కూడా అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ఒక సంవత్సరంలోపు ఇళ్లను సిద్ధం చేసి లబ్ధిదారులకు తాళాలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఇది కేవలం ఇల్లు ఇచ్చే కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబానికి శాశ్వత చిరునామా, భద్రమైన భవిష్యత్తు, పిల్లలకు మెరుగైన జీవితం, మహిళలకు ఆస్తిపై హక్కును కల్పించే కార్యక్రమమని అన్నారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో "పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అనే నిబద్ధతతో ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు. స్థానిక శాసనసభ్యులు ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, పేద ప్రజలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టడం సంతోషకరమైన విషయమన్నారు. ఇల్లు లేని పేద కుటుంబాల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. హౌసింగ్ బోర్డు ఎండీ పి.వి. గౌతమ్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి కేటాయించిన 480 ఇందిరమ్మ ఇళ్లకు లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. ఈ ఇళ్ల కోసం మొత్తం 1,881 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేస్తూ లక్కీ డ్రా ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. లక్కీ డ్రాలో పేరు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, వెయిటింగ్ లిస్ట్ నిర్వహించి, భవిష్యత్ దశల్లో మరిన్ని ఇళ్లు మంజూరైనప్పుడు వారికి కూడా అవకాశం కల్పిస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు హౌసింగ్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని ఎండీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) డాక్టర్ కె.కిరణ్మయి, రాజేందర్ నగర్ ఆర్డీఓ శ్రీధర్, పిడి హౌసింగ్ చంప్లా నాయక్, సంబంధిత అధికారులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా రేషన్ బియ్యంతరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు




● ఆటో సీజ్ చేసిన.. తెలకపల్లి ఎస్సై రమేష్

**తెల్కపల్లి : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** తుమ్మెన్ పేట గ్రామం బల్మూరు మండలానికి చెందిన చెందిన మల్లేష్, అనే వ్యక్తి గత కొంతకాలంగా తెలకపల్లి మండలం చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుండి తెల్ల రేషన్ కార్డుదారుల నుండి కిలో ఒక్కంటికి 18 నుంచి 20 రూపాయలు చొప్పున కొనుగోలు చేసి అధిక ధరలకు నల్లబజారులో అమ్ముకొనుటకు ఈరోజు నాగర్ కర్నూల్ కు తరలిస్తున్నాడని నమ్మదగిన సమాచారం మేరకు సివిల్ సప్లై డిపార్ట్మెంట్, డిప్యూటీ తహసిల్దార్, శ్రీ. హేమ్లా నాయక్ మరియు తెల్కపల్లి పోలీస్ వారి సమక్షంలో ఈరోజు మధ్యాహ్నం 2:00 గంటలకు సంఘటన స్థలానికి వెళ్లి వాహనాలు తనకు చేయుచుండగా TG 08T 5172 అను నెంబర్ గల అశోక్ లేలాండ్ వాహనం గలది అనుమానాస్పదంగా ఉండగా దాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 60 గన్ని బస్తాలలో 30 క్వింటాళ్ల ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన రాణా బియ్యం ఉండగా వాటిని పంచనామయుక్తంగా సీజ్ చేసి డిప్యూటీ తాసిల్దారు శ్రీ. హేమ్లా నాయక్, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడమైనది.

# రాఖీ పండుగ వేళ మొయినాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సోనియా దర్శన్ ప్రత్యేక సందడి





● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన షాబాద్ సోనియా దర్శన్

● వేం నరేందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లకు రాఖీ కట్టి ఆశీస్సులు పొందిన చైర్‌పర్సన్

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి - ఆగస్టు 28, చేవెళ్ల నియోజకవర్గం:** రాఖీ పండుగ సందర్భంగా మొయినాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి షాబాద్ సోనియా దర్శన్ పలువురు ప్రముఖులను కలిసి రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి రాఖీ కట్టి ఆయన ఆశీస్సులు పొందారు. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి, తిరుపతి రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాఖీలు కట్టి వారి ఆశీస్సులు తీసుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధాన్ని చాటుతూ సోనియా దర్శన్ నిర్వహించిన ఈ కార్యక్రమాలు ప్రత్యేకంగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆయా నాయకులు ఆమెకు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీర్వదించారు. ప్రజా జీవితంలో మహిళలు మరింత ముందుకు సాగాలని, సమాజంలో సోదరభావం, ఆత్మీయతలు పెంపొందాలని ఆకాంక్షించారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీక



● తమ్ముడు నరసింహారెడ్డికి రాఖీ కట్టిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

● ప్రేమానురాగాలు, ఆత్మీయతలకు అద్దం పట్టిన రాఖీ వేడుకలు

● తెలంగాణ ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపిన సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం, భవిష్యత్ ప్రజాపాలన :** అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న అనుబంధం, ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వదినాన్ని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా, ఆత్మీయంగా జరుపుకున్నారు. రక్షాబంధన్ సందర్భంగా తన తమ్ముడు నరసింహారెడ్డి నివాసానికి వెళ్లిన సబితా ఇంద్రారెడ్డి, సంప్రదాయబద్ధంగా రాఖీ కట్టి సోదరసోదరీమణుల మధ్య ఉన్న ప్రేమానురాగాలను చాటుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల మధ్య సంతోషకరమైన, ఆత్మీయ వాతావరణం నెలకొంది. చిన్ననాటి నుంచి కలిసి పెరిగిన అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని మరింత గుర్తుచేసే పండుగగా రక్షాబంధన్ నిలుస్తుందని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. జీవితంలో ఎన్ని బాధ్యతలు, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా కుటుంబ బంధాలు ఎప్పటికీ ప్రత్యేకమైనవేనని అన్నారు. రాఖీ కట్టడం ద్వారా సోదరసోదరీమణులు తమ మధ్య ఉన్న ప్రేమను, నమ్మకాన్ని, ఆప్యాయతను మరోసారి గుర్తు చేసుకుంటారని తెలిపారు.

**బంధాలను బలపరిచే పవిత్ర పండుగ**

రక్షాబంధన్ పండుగ భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలకు ప్రతిబింబమని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అక్కాచెల్లెళ్లకు అన్నదమ్ములు అండగా ఉంటారనే నమ్మకానికి, అన్నదమ్ముల పట్ల అక్కాచెల్లెళ్లకు ఉండే అపారమైన ప్రేమకు రాఖీ ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. "రాఖీ ఒక సాధారణ దారం కాదు.. అది అన్నాచెల్లెళ్ల మనసులను కలిపే ప్రేమ బంధం. కాలం మారినా, పరిస్థితులు మారినా కుటుంబ బంధాల విలువ ఎప్పటికీ మారదు. ప్రేమతో కట్టిన రాఖీ బంధం జీవితాంతం నిలిచిపోతుంది" అని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుత ఆధునిక జీవన విధానంలో కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో ఉంటూ తమ తమ బాధ్యతల్లో నిమగ్నమవుతున్నప్పటికీ, రక్షాబంధన్ వంటి పండుగలు అందరినీ మరోసారి ఒకచోట చేర్చుతున్నాయని అన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలను పెంపొందించడంతో పాటు భారతీయ సంప్రదాయాలను, సంస్కృతిని తరువాతి తరాలకు పరిచయం చేయడంలో ఇటువంటి పండుగలు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు.

**ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి**

రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ సబితా ఇంద్రారెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి అక్కాచెల్లెలి జీవితంలో అన్నదమ్ముల ప్రేమ, ప్రతి అన్నదమ్ముడి జీవితంలో అక్కాచెల్లెళ్ల ఆప్యాయత ఎల్లప్పుడూ నిండుగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆరోగ్యం, ఆనందం వెల్లివిరియాలని, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు మరింత బలపడాలని కోరుకున్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి పండుగలను జరుపుకోవడం ద్వారా పరస్పర సంబంధాలు మరింత బలపడటంతో పాటు కుటుంబ విలువలు నిలుస్తాయని అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా సోదరసోదరీమణులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ తమ బంధాన్ని మరింత దృఢపరుచుకోవాలని, జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా పరస్పరం అండగా నిలవాలని సబితా ఇంద్రారెడ్డి ఆకాంక్షించారు.

**ఆత్మీయతకు ప్రతిరూపంగా రాఖీ వేడుక**

తమ్ముడు నరసింహారెడ్డికి రాఖీ కట్టిన సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయంగా గడిపారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, అన్నాచెల్లెళ్ల అనుబంధం జీవితంలో ఎంత గొప్పదో వివరించారు. కుటుంబ బంధాలకు విలువనిస్తూ సంప్రదాయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. "జీవితంలో ఎన్నో బంధాలు వస్తాయి.. ఎన్నో సంబంధాలు ఏర్పడతాయి. కానీ బాల్యం నుంచి మనతో నడిచే అన్నాచెల్లెళ్ల బంధం మాత్రం ప్రత్యేకమైనది. ఆ బంధంలో ఉండే ప్రేమకు వెలకట్టలేం.. ఆప్యాయతకు హద్దులుండవు. ఆ పవిత్రమైన బంధానికి ప్రతీకే రక్షాబంధన్" అని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

**ప్రేమను పంచే పండుగ.. బంధాలను కలిపే పండుగ**

రక్షాబంధన్ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, సోదరసోదరీమణులు ఆనందంగా వేడుకలు జరుపుకోవడం ద్వారా సమాజంలో ప్రేమ, సోదరభావం మరింత పెంపొందుతుందని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. పండుగల అసలు ఉద్దేశం కేవలం ఆచారాలను పాటించడం మాత్రమే కాకుండా మనుషుల మధ్య అనుబంధాలను మరింత బలోపేతం చేయడమేనని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి అక్కాచెల్లెలు, ప్రతి అన్నదమ్ముడు ఆనందంగా రక్షాబంధన్ జరుపుకోవాలని, వారి జీవితాల్లో ప్రేమ, సంతోషం, ఐక్యత ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

**"ప్రేమకు ప్రతీక రాఖీ..**

ఆప్యాయతకు చిరునామా అన్నాచెల్లెళ్ల బంధం.. నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం రక్షాబంధన్.. కుటుంబ విలువలను కాపాడే పవిత్రమైన పండుగ రక్షాబంధన్" అని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో ఐక్యత, ప్రతి మనసులో ప్రేమ వెల్లివిరియాలని, అన్నాచెల్లెళ్ల అనుబంధం ఎల్లప్పుడూ ఇలాగే చిరస్థాయిగా కొనసాగాలని సబితా ఇంద్రారెడ్డి ఆకాంక్షించారు.

# మృతుల కుటుంబాలకు పామేన భీమ్ భరత్ పరామర్శ



● ఏళ్లకొండలో బాధిత కుటుంబాలను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి -ఆగస్టు 28, చేవెళ్ల నియోజకవర్గం:** నవాబుపేట మండలం



ఏళ్లకొండ గ్రామానికి చెందిన 4వ వార్డు సభ్యులు జోగు పద్మమ్మ, మల్లేపల్లి రుక్కమ్మలు గత వారం మృతిచెందడంతో వారి కుటుంబాలను చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ శుక్రవారం పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలకు పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సామ వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకటయ్య, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, ఏళ్లకొండ సర్పంచ్ కొండల్ యాదవ్, ఉపసర్పంచ్ రామ్ చందర్, పులుమామిడి సర్పంచ్ నరసింహులు, నరేగూడ సర్పంచ్ దీపికా దశరథ్, ముబారక్‌పూర్ సర్పంచ్ జమ జయయ్య, తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ ప్రభాకర్, ఉపసర్పంచ్ మల్లేష్, యువజన కాంగ్రెస్ నాయకుడు దయానంద్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి అద్దం పట్టిన దేవరకొండ

# రాఖీ వేడుకల్లో వెల్లివిరిసిన ఆప్యాయత



● చీరల్లో చెల్లెళ్ల సంతోషం.. రాఖీల్లో అన్నల ఆయుష్షు - దేవరకొండలో ఘనంగా రాఖీ పౌర్ణమి

● రాఖీ బంధంతో ఒక్కటైన కుటుంబం - దేవరకొండలో సంప్రదాయాన్ని నిలబెడుతున్న కుటుంబం

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య :** అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న స్వచ్ఛమైన ప్రేమానుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలు నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. ప్రతి ఏటా ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్లు, అన్న దమ్ములు, కూతుళ్లు, బంధుమిత్రులు అంతా ఒకే చోట చేరి వేడుకను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. వేడుకలో భాగంగా కుటుంబంలోని మహిళలు, అక్కాచెల్లెళ్లు, కూతుళ్లు తమ అన్నదమ్ములకు ఎంతో ఆప్యాయంగా రాఖీలు కట్టి,వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ఆకాంక్షించారు. అన్నదమ్ములు సైతం తమ సోదరీమణులపై ఉన్న ప్రేమను చాటుకుంటూ వారికి నూతన చీరలను బహుమతులుగా అందజేశారు. చిన్నారులు సైతం పెద్దలకు రాఖీలు కట్టి సందడి చేశారు. మరోవైపు రాఖీ పండుగ నేపథ్యంలో దేవరకొండ మార్కెట్లో రాఖీల కొనుగోలు జోరుగా సాగింది. రకరకాల డిజైన్లలో ఉన్న రాఖీలను కొనుగోలు చేసేందుకు మహిళలు బారులు తీరారు. దీంతో



మార్కెట్ కళకళలాడింది. కుటుంబ విలువలకు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఈ వేడుక నిదర్శనంగా నిలిచింది.

## 'ఆకాశ్' ప్రతిభ పరీక్ష 'అంథే' రిజిస్ట్రేషన్లు ప్రారంభం



**భవిష్యత్తు ప్రజాపాలన/ హైదరాబాద్ :** విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షలు (నీట్, జెఈఈ) నెగ్గేందుకు దోహదపడటమేగాక, స్వీయ అవగాహన, తమ సామర్థ్యాన్ని పరీక్షించుకోవడానికి మరింత పట్టు సాధించేలా ఆకాశ్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్ (అంథే) నిర్వహిస్తున్నట్టు ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) నిర్వాహకులు ఆకాశ్, అమిత్ కుమార్, అర్బిండ్ కుమార్, అంకిత్ రాజ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని ఆకాశ్ ఇనిస్టిట్యూట్లో దేశంలోనే అతిపెద్ద స్కాలర్షిప్ ప్రతిభా పరీక్ష 'అంథే -2026'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. గత 16 ఏళ్లుగా కోటిమందికిపైగా విద్యార్థులు అంథేలో నమోదు చేసుకొన్నారని తెలిపారు. విద్యార్థులు తమ భవిష్యత్తు ప్రయాణానికి బలమైన పునాది వేసుకోవడానికి ఈ పరీక్ష సహాయపడుతుందన్నారు. 2026 అంథే రాసేందుకు ఆసక్తి ఉన్న ఏడో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు అంథే పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అంథే ఆన్లైన పరీక్ష అక్టోబర్ 27 నుంచి నవంబర్ 1 వరకు, ఆఫ్లైన్ పరీక్ష అక్టోబర్ 11 నుంచి నవంబర్ 1 వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల ప్రతిభ, ప్రదర్శనలకు బహుమతులుగా 100శాతం వరకు స్కాలర్షిప్లు, రూ.2.5 కోట్ల నగదు బహుమతులు అందిస్తామని వివరించారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి వెండి రాఖీ కట్టిన మామిడి మాదేవి

- **రక్షాబంధన్ వేడుకల్లో ఆత్మీయత.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా ప్రత్యేక రాఖీ**
- **కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు, సబ్జీమండి గంగపుత్ర ముద్దుబిడ్డ మామిడి మాదేవి**



**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన :** అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు, సబ్జీమండి గంగపుత్ర ముద్దుబిడ్డ మామిడి మాదేవి ప్రత్యేకంగా వెండి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టి తన అభిమానాన్ని, ఆత్మీయతను చాటుకున్నారు. రక్షాబంధన్ సందర్భంగా ముఖ్యమంత్రికి వెండి రాఖీ కట్టడం రాజకీయ వర్గాల్లోనూ, మహిళా కాంగ్రెస్ శ్రేణుల్లోనూ ప్రత్యేకంగా నిలిచింది. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర నమ్మకానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకొని మామిడి మాదేవి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టడం ద్వారా మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యతను, మహిళా సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా మామిడి మాదేవి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి అక్కాచెల్లెమ్మకు అన్నగా అండగా నిలుస్తున్నారని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన, సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. రక్షాబంధన్ పర్వదినాన ముఖ్యమంత్రికి రాఖీ కట్టడం తనకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. తెలంగాణలో మహిళలకు మరింత గౌరవం, భద్రత, సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మామిడి మాదేవి తెలిపారు. మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలు దేశానికి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. "రాఖీ అనేది కేవలం ఒక దారం కాదు.. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ, నమ్మకం, రక్షణకు ప్రతీక. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు తెలంగాణ ఆడబిడ్డలకు అన్నగా అండగా నిలవాలి. రాష్ట్రంలోని ప్రతి మహిళ సంతోషంగా, గౌరవంగా జీవించేలా ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలి" అని మామిడి మాదేవి ఆకాంక్షించారు. కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మహిళా విభాగం తరపున నిరంతరం కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మహిళలకు అందుతున్న పథకాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందుకు రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. సబ్జీమండి ప్రాంతంతో పాటు కార్వాన్ నియోజకవర్గంలో మహిళలు, పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మామిడి మాదేవి తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని అన్నారు. రక్షాబంధన్ పర్వదినాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వెండి రాఖీ కట్టిన మామిడి మాదేవికి కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా సాగిన ఈ రాఖీ వేడుక రాజకీయ, సామాజిక వర్గాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణలో మహిళల సంక్షేమం, భద్రత, సాధికారతకు మరింత ప్రాధాన్యత లభించాలని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని మామిడి మాదేవి ఆకాంక్షించారు. రక్షాబంధన్ సందర్భంగా ముఖ్యమంత్రికి రాఖీ కట్టడం ద్వారా "సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ అన్నగా అండగా ఉండాలి" అనే సందేశాన్ని ఆమె చాటిచెప్పారు.

## తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో పరామర్శించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క





**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 28 :** గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్‌ని ఈరోజు సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

## రాఖీ కట్టిన ఎమ్మెల్యే యశస్విని



**భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి:** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోదరీమణులకు రాఖీలు కట్టి హృదయపూర్వక రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. రక్షాబంధన్ అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమకు, పరస్పర నమ్మకానికి, రక్షణకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. సమాజంలో మహిళలకు గౌరవం, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో ఆప్యాయంగా కలుసుకుని వారికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అందరికీ మిఠాయిలు పంచి రక్షాబంధన్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. రక్షాబంధన్ పర్వదినం ప్రతి కుటుంబంలో ప్రేమ,ఆప్యాయత,ఐక్యత మరింత బలపడాలని, ప్రతి సోదరి సోదరుడు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని రెడ్డి ఆకాంక్షించారు.

## కొడకండ్ల మండలంలో తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని ..





**భవిష్యత్ ప్రజాపాలన జనగాం జిల్లా:** కొడకండ్ల మండలం ఉమ్మడి మైదం చెరువు గిర్ని తండా గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో పాలకుర్తి శాసన సభ్యురాలు శ మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు, యువతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. తీజ్ పండుగ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే విశిష్టమైన పర్వదినమని అన్నారు. మహిళలు ఆనందోత్సాహాలతో సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని పండుగను ఘనంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఉత్సవాల్లో మహిళలతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, తీజ్ సంబరాలను వీక్షించి గ్రామ పెద్దలు, యువత, మహిళలతో ఆప్యాయంగా ముచ్చటించారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు మరియు గిర్ని తండా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి



**గుండాల ఆగస్టు 28 యాదాద్రి జిల్లా భవిషత్ ప్రజా పాలన:** గుండాల మండలంలో ఎస్సై వి సైదులు తురకల షాపురం గ్రామంలో గ్రామస్తులతో సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని గ్రామంలో అపరిచిత వ్యక్తులు సంచరించినట్లయితే వారి వివరాలు నమోదు చేసుకోవాలని స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు టోల్ ఫ్రీ నెంబర్లు పై అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా గ్రామానికి సంబంధించి గ్రామ యూనిటీగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లయితే ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రతి ఒక్కటి కూడా సీసీ కెమెరాలు ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు ప్రతినిత్యం ఏదో రకంగా ప్రజలు మోసపోతున్నారని ఎంతఅవగాహన కల్పించినా ఏమి చేసినా మోసం చేసేవాడు చేస్తూనే ఉన్నాడని ప్రజలుఅవగాహన కలిగి ఉన్నట్లయితే ఎలాంటి మోసాలు జరగకుండా ప్రజలు మోసపోకుండా చట్టం తనపని తాను చేసుకు పోతుందని అన్నారు ఇటీవల వ్యవసాయ బావుల వద్ద ఉన్న పశువులు మేకలు మోటార్లు గ్రామ సమీపంలో ఉన్న దేవాలయాలు పూజ సామాగ్రి దొంగతనం ఇలాంటివి ప్రజలు అవగాహన కలిగిఉండాలని అన్నారుఇప్పుడున్న టెక్నాలజీ ప్రకారం ఎలాంటి చిన్న పొరపాటు జరిగిన జోషులను వెంటనే పట్టుకు నే విధంగా అన్ని రకాల టీములు పనిచేస్తున్నాయని అన్నారు ప్రతి గ్రామంలో విద్యార్థులు యువత టోల్ ఫ్రీ నెంబర్ల పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు ప్రతినిత్యం స్థానిక పోలీస్ వాహనం మొబైల్ టీములు మండలంలో ప్రతి గ్రామం తిరుగుతూనే ఉంటాయని అన్నారు.

## రాఖీ బంధం... అనురాగ బంధం!
### కొండభీమనపల్లిలో ఘనంగా రాఖీ పౌర్ణమి



- **కట్టేది రాఖీ కాదు... జన్మజన్మల అనుబంధం - దేవరకొండలో అక్కాచెల్లెళ్ళ ఆత్మీయ వేడుక**



**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య :** దేవరకొండ రాఖీ పౌర్ణమి సందర్భంగా నల్గొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామంలో రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. అక్క చెల్లెల్లు రాఖీ కడుతున్న దృశ్యాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి వాస్తవానికి అక్క తమ్ముళ్లకు లేదా అన్నకు కట్టడం అలేదు సంప్రదాయం కానీ ఇక్కడున్న చిన్నారులు అక్కకి చెల్లీ చెల్లికి అక్క రాఖీలు కట్టుకున్నారు మరో దృశ్యంలో అక్కా చెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి, నుదుట తిలకం దిద్ది, మిఠాయిలు తినిపించి ఆనందంగా గడిపారు. చిన్నారుల నుండి పెద్దల వరకు అందరూ ఈ వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీక అయిన ఈ పండుగను కుటుంబ సభ్యులంతా కలిసి ఆత్మీయంగా జరుపుకున్నారు. సోదరులు తమ సోదరీమణులను జీవితాంతం కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాట ఇచ్చారు. గ్రామంలో ఎక్కడ చూసినా రాఖీ పండుగ శోభ సంతరించుకుంది.

## హైదరాబాద్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ షో-2026 ప్రారంభమైంది



**హైదరాబాద్, ఆగస్టు28 (భవిష్యత్ ప్రజాపాలన):** 'రేట్ ఆగదు.. డిమాండ్ తగ్గదు' అనే థీమ్‌తో మూడు రోజుల పాటు ఈ ప్రాపర్టీ షో జరగనుంది. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఆగస్టు 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో 60కి పైగా రియల్ ఎస్టేట్ డెవలపర్లు పాల్గొంటున్నారు. 300కు పైగా రేరా అనుమతి పొందిన ప్రాజెక్టులను ఒకే వేదికపై ప్రదర్శిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, భువనగిరి ఎమ్మెల్యే కె. అనిల్ కుమార్ రెడ్డి ఈ ప్రాపర్టీ షోను ప్రారంభించారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సరఫరా, అమ్మకాల వేగం, ఇళ్ల పరిమాణాలు, ప్రాంతాల వారీగా మార్కెట్ పరిస్థితులపై క్రెడాయ్ హైదరాబాద్, క్రె మ్యాట్రిక్స్ సంయుక్తంగా రూపొందించిన నివేదికను కూడా ఈ సందర్భంగా విడుదల చేశారు. 2026 తొలి ఆరు నెలల్లో హైదరాబాద్‌లో 26 వేల 100కు పైగా ఇళ్లు విక్రయమయ్యాయని క్రెడాయ్ ప్రతినిధులు తెలిపారు. సుమారు 60 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణం అమ్ముడైనట్లు వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ బలమైన వృద్ధి, కొనుగోలుదారుల విశ్వాసంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం--రియల్ ఎస్టేట్ రంగం మధ్య సమన్వయం పెరగాల్సిన అవసరం ఉందని, నిర్మాణ అనుమతులకు సంబంధించిన మార్టేజ్, నాలా సమస్యలను పరిష్కరించాలని క్రెడాయ్ హైదరాబాద్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. మరోవైపు హైదరాబాద్‌లో పెరుగుతున్న కార్యాలయ స్థలాలు, ఉపాధి అవకాశాలు భవిష్యత్‌లో గృహాల డిమాండ్‌ను మరింత పెంచే అవకాశం ఉందని క్రె మ్యాట్రిక్స్ వెల్లడించింది. ప్రాపర్టీ షోలో భాగంగా హైదరాబాద్ చరిత్ర, సంస్కృతి, నగర జీవన విధానంపై హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ సహకారంతో ప్రత్యేక కార్యక్రమాలు, చర్చలు, సాహిత్య పఠనాలు, క్విజ్ నిర్వహించనున్నారు.

## తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో పరామర్శించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క





**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 28 :** గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్ ని ఈరోజు సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

## తాతకు రాఖీ కట్టి మురిసిపోయిన మనవరాలు



**ఖైరతాబాద్, ఆగస్టు 28(భవిష్యత్ ప్రజాపాలన):** రాఖీ పండుగ సందర్భంగా తాతకు మనవరాలు(హిరణ్మయి శ్రీ) రాఖీ కట్టి తన ప్రేమాభిమానాలను చాటుకుంది. ఎంతో ఆప్యాయంగా తాత చేతికి రాఖీ కట్టి, ఆశీర్వాదం తీసుకుంది. మనవరాలు రాఖీ కట్టడంతో తాత ఆనందం వ్యక్తం చేస్తూ ఆమెను ఆశీర్వదించారు. తాత-మనవరాలి మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించిన ఈ దృశ్యం పలువురిని ఆకట్టుకుంది.

# డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడం కష్టం: హనుమ విహారి



శ్రీలంకతో రెండో టెస్ట్ డ్రా చేసుకున్న టీమిండియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరడం చాలా కష్టమని వెటరన్ బ్యాటర్ హనుమ విహారి అన్నాడు. శ్రీలంకతో రెండో టెస్ట్‌ను భారత్ గెలిచి ఉంటే డబ్ల్యూటీసీ అవకాశాలు ఇంకాస్త మెరుగ్గా ఉండేవని అభిప్రాయపడ్డాడు. కొలంబో వేదికగా జరిగిన రెండో టెస్ట్‌ను టీమిండియా చేజేతులా డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే. సోనాల్ దినుషా అజేయ శతకంతో శ్రీలంక ఓటమిని తప్పించుకుంది. ఈ మ్యాచ్ ఫలితంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన హనుమ విహారి.. శ్రీలంక పోరాట పటిమను ప్రత్యేకంగా కొనియాడాడు. ఈ సిరీస్‌ను భారత్ గెలిచినా.. శ్రీలంక మనసులను గెలిచిందని చెప్పుకొచ్చాడు. 'అద్భుతమైన పోరాటంతో శ్రీలంక మనుసులను గెలిచింది. సోనాల్ దినుషా అద్భుతంగా బ్యాటిగ్ చేశాడు. తన ఫస్ట్ క్లాస్ అనుభవం చూపించాడు. స్వీప్, రివర్స్ స్వీప్ షాట్స్‌తో భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. రెండు మ్యాచ్‌ల్లో మూడు సెంచరీలు చేశాడు. క్వాలిటి బౌలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలో అలా ఆడాడు. శ్రీలంక దిగ్గజాలైన కుమార సంగక్కర, మహేళ జయవర్ధనే, సనత్ జయసూర్య వంటి దిగ్గజ ఆటగాళ్ల తరహాలో సోనాల్ దినుషా గొప్ప ఆటగాడిగా ఎదుగుతాడు. భారత్ విషయానికి వస్తే.. టాస్ గెలవడం కలిసొచ్చింది. దేవదత్ పడిక్కల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో మూడో స్థానాన్ని భర్తీ చేశాడు. ఐపీఎల్, ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఫామ్‌ను కొనసాగించాడు. కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ కూడా బాగా ఆడారు. ధ్రువ్ జురెల్ కూడా అద్భుతంగా ఆడాడు. టాప్-5లో ఆడే సామర్థ్యం తనకు ఉందని నిరూపించుకున్నాడు. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను బాగా ఆడాడు. శుభ్‌మన్ గిల్ కూడా హాఫ్ సెంచరీతో పర్వాలేదనిపించాడు. యశస్వి జైస్వాల్ వైఫల్యమే ఆందోళనకు గురిచేసే విషయం. అతను మినహా బ్యాటింగ్ ఆర్డర్ మొత్తం అదరగొట్టింది. గత సిరీస్‌లతో పోల్చితో స్పిన్‌ను అద్భుతంగా ఆడింది. బౌలింగ్ విషయానికి వస్తే.. సిరాజ్ కాస్త అలసిపోయినట్లు కనిపించాడు. అతనికి ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి ఇచ్చి గుర్నూర్ బ్రార్‌ను ఆడించాల్సిందేమో. కుల్దీప్ యాదవ్ ఆడించినా బాగుండేది. సారాన్ష్ జైన్ వికెట్లు తీసినా.. అతని బౌలింగ్ శైలి శ్రీలంక పిచ్‌లకు సూటవ్వదు. చాలా స్లోగా బౌలింగ్ చేస్తాడు. దాంతో శ్రీలంక బ్యాటర్లు ఈజీగా స్వీప్ షాట్స్ ఆడారు. మానవ్ సుతార్ మాత్రం అదరగొట్టాడు. జడేజాకు పర్‌ఫెక్ట్ రిప్లేస్‌మెంట్ అతను. ఎలాంటి కండిషన్స్‌లోనైనా బౌలింగ్ చేయగలడు. ప్రసిధ్ కృష్ణ కూడా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఈ సిరీస్‌ను భారత్ 2-0తో గెలవాల్సింది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడం కష్టం. 2-0తో గెలిస్తే పరిస్థితి మెరుగ్గా ఉండేది. భారత్ ఇంకా 7 మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా.. అందులో 6 గెలవాలి. న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా రెండు టెస్ట్‌లు గెలవాలంటే అద్భుతం జరగాలి. ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై ఐదు టెస్ట్‌ల్లో విజయం సాధించాలి. ప్రాక్టికల్‌గా ఇది అసాధ్యం.'అని హనుమ విహారి అభిప్రాయపడ్డాడు.

# గంభీర్‌పై మాజీ ఓపెనర్ సదగోపన్ రమేశ్ విమర్శలు



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై మాజీ ఓపెనర్ సదగోపన్ రమేశ్ విమర్శలు గుప్పించాడు. శ్రీలంకతో రెండో టెస్ట్ డ్రా కావడంతో గౌతమ్ గంభీర్ ముఖం చాటేసాడని మండిపడ్డాడు. భారత్‌కు ప్రతికూల ఫలితాలు ఎదురైనప్పుడల్లా గౌతమ్ గంభీర్ మీడియాకు దూరంగా ఉంటాడని, యువ ఆటగాళ్లకు ఆ బాధ్యతలు అప్పగిస్తాడని ఆరోపించాడు.భారత్ విజయం సాధించినప్పుడే మీడియా సమావేశంలో పాల్గొని ప్రగల్భాలు పలుకుతాడని విమర్శించాడు. శ్రీలంకతో తొలి టెస్ట్ విజయానంతరం మీడియాతో మాట్లాడుతూ.. గంభీర్ చేసిన వ్యాఖ్యలను కూడా రమేశ్ తప్పుబట్టాడు. తొలి టెస్ట్ విజయానంతరం గంభీర్ మాట్లాడుతూ.. ప్రస్తుత భారత జట్టు సంధి దశలో ఉందని చెప్పాడు. 'ర్యాంకింగ్స్ ముఖ్యం కాదు. టెస్ట్‌ల్లో టీమిండియా ఏ మాత్రం ఇబ్బంది పడటం లేదు. ఇంగ్లండ్ పర్యటన నుంచి మేం మెరుగైన ప్రదర్శనే చేశాం. హెడ్ కోచ్‌గా నా దృష్టిలో జట్టు పురోగతికి అంతిమ కొలమానం.. ర్యాంకింగ్స్, వ్యక్తిగత ప్రదర్శనల చుట్టూ ఉండే హడావిడి కాదు. జట్టు ట్రోఫీలు గెలవగలదా లేదా అన్నదే ముఖ్యం. ట్రోఫీలు గెలవడమే కోచ్‌గా నా పని. నేను పట్టించుకునేది, నమ్మేది కూడా అదొక్కటే. ఇతరుల అభిప్రాయాలు, ఇష్టాలతో నాకు పనిలేదు.' అని గంభీర్ స్పష్టం చేశాడు. ఈ వ్యాఖ్యలను గుర్తు చేసిన రమేశ్.. ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం సాధించకుండా డబ్ల్యూటీసీ టైటిల్ ఎలా గెలుస్తారని ప్రశ్నించాడు. 'తొలి టెస్ట్ విజయం తర్వాత గంభీర్ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. భారత్ విజయం సాధిస్తేనే అతను మీడియాతో మాట్లాడుతాడనే విషయం అందరికి తెలుసు. ఓడితే ఇతరులను పంపిస్తాడు. ర్యాంకింగ్స్ ముఖ్యం కాదని, టెస్ట్‌లో భారత్ ఇబ్బంది పడటం లేదని అంటాడు. ఇలా ఎలా చెబుతాడు. ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉంటేనే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించగలం. అలాగే రెడ్ బాల్ క్రికెట్‌లో భారత్ తడబడుతోందని యావత్ ప్రపంచానికి తెలుసు. నిద్రపోతున్న వారిని లేపవచ్చు. కానీ నిద్ర నటిస్తున్నవారిని ఎప్పటికీ లేపలేం. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను భారత్ గెలుస్తుందని నేను అనుకోవడం లేదు. అసలు ఫైనల్ చేరుతుందనే గ్యారెంటీ కూడా నాకు లేదు.'అని సదగోపన్ రమేశ్ విమర్శించాడు. డబ్ల్యూటీసీ 2027 సైకిల్‌లో భారత్ ఇంకా 7 టెస్ట్‌లు ఆడాలి. ఇందులో భారత్ కనీసం 7 లేదా 6 మ్యాచ్‌లు గెలవాలి. ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోవద్దు. అప్పుడే భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరగలదు. భారత్ తమ తదుపరి టెస్ట్ సిరీస్‌లను న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో ఆడనుంది. న్యూజిలాండ్ పర్యటనలో రెండు టెస్ట్‌లు, సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో 5 టెస్ట్‌లు ఆడాల్సి ఉంది.

# కోహ్లీ ఆడి ఉంటే ఫలితం మరోలా ఉండేది

## మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ సూచన



శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఆడి ఉంటే ఫలితం మరోలా ఉండేదని మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అన్నాడు. కోహ్లీ తన దూకుడైన స్వభావంతో ఆటగాళ్లను ఉత్తేజరిచేవాడని తెలిపాడు. కొలంబో వేదికగా గురువారం ముగిసిన రెండో టెస్ట్‌లో సోనాల్ దినుషా అజేయ శతకంతో శ్రీలంక ఓటమి నుంచి గట్టెక్కిన సంగతి తెలిసిందే. సునాయసంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌ను భారత్ చేజేతులా డ్రా చేసుకుంది. ఆఖరి రోజు ఆటలో నలుగురు బ్యాటర్లను ఔట్ చేయలేక మూల్యం చెల్లించుకుంది. ఈ మ్యాచ్ ఫలితంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన కైఫ్.. కోహ్లీ ఉండి ఉంటే అతను అరుస్తూ ఆటగాళ్లను అప్రమత్తం చేసేవాడని చెప్పుకొచ్చాడు.'టెస్ట్ క్రికెట్ ఆడటం అందరికీ చాయ్ తాగినంత ఈజీ కాదు బాస్. ఇది చాలా సుదీర్ఘమైన ఆట. ఈ ఫార్మాట్‌లో నిరంతరం బౌలింగ్ చేస్తూనే ఉండాలి. ఒకవేళ ఈ మ్యాచ్ విరాట్ కోహ్లీ ఆడి ఉంటే.. అతను నిరంతరం అరుస్తూ జట్టును అప్రమత్తంగా ఉంచేవాడని నాకు అనిపించింది. కొన్ని సందర్భాల్లో మనం 'బౌలింగ్ చేస్తూ ఉంటే చాలు.. అదే జరుగుతుంది. బంతి చాలా టర్న్ అవుతోంది. దానంతట అదే వికెట్ పడుతుందిలే' అని అనుకుంటూ మ్యాచ్‌ను తేలిగ్గా తీసుకున్నామేమో అనిపించింది. భారత్ స్వయంగా సృష్టించుకున్న అవకాశాలు చాలా తక్కువ. మన ఆటగాళ్ల ఎనర్జీ లెవెల్స్ కూడా చాలా తక్కువగా కనిపించాయి. అందుకే విరాట్ కోహ్లీ ఈ మ్యాచ్ ఆడి ఉంటే ఫలితం మరోలా ఉండేదని నేను అనుకుంటున్నా. ఎందుకంటే అతను 'కమాన్ సర్ఫరాజ్, కమాన్ జైస్వాల్' అంటూ ప్రతి ఒక్కరిలో ఉత్సాహాన్ని నింపేవాడు. అలాగే సోనాల్ దినూషాను కూడా వదిలేవాడు కాదు. తన స్లెడ్జింగ్‌తో రెచ్చగొట్టేవాడు. కానీ భారత్ ఆటగాళ్లు లాహిరు కుమారతో ఘర్షణకు దిగారు.'అని కైఫ్ అసహనం వ్యక్తం చేశాడు. సోనాల్ దినూషాను డీకోడ్ చేయడంలో భారత జట్టు పూర్తిగా విఫలమైందని కైఫ్ మండిపడ్డాడు. కవర్ డ్రైవ్ ఆడటంలో అతనికి ఇబ్బంది ఉన్నా.. ఆ దిశగా టీమిండియా బౌలింగ్ వ్యూహాలు కనిపించలేదన్నాడు. 'ప్రతీ బ్యాటర్‌కు ఏదో ఒక లోపం ఉంటుంది. ఆ లోపాన్ని కనుగొనడంలో భారత్ విఫలమైంది. నేను కేవలం శుభ్‌మన్ గిల్‌ను మాత్రమే నిందించడం లేదు. సోనాల్ దినుషా బలహీనతను పసిగట్టడంలో బౌలింగ్ విభాగంతో పాటు కోచింగ్ సిబ్బంది దారుణంగా విఫలమైంది. అతనికి ఒక్క డ్రైవ్ షాట్ బాల్ కూడా వేయలేదు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ తర్వాత డ్రైవ్ బాల్‌తోనే సోనాల్ దినూషాను సారాన్ష్ జైన్ ఔట్ చేశాడు. కానీ ఈ విషయాన్ని భారత బౌలర్లు మరిచిపోయారు. మహమ్మద్ సిరాజ్ ఫుల్ బాల్ వేసినా అతను తెలివిగా వదిలేసాడు. అతను షాట్లు ఆడటానికి ఏ మాత్రం ఇష్టపడలేదు. దినూషాను లైట్ తీసుకోవడంతోనే విజయం చేజారింది'అని కైఫ్ చెప్పుకొచ్చాడు.

# జపాన్ ఏర్పాట్లపై బీసీసీఐ తీవ్ర అసంతృప్తి



జపాన్ లోని ఐచి నగోయా వేదికగా సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభం కానున్న ఏషియన్ గేమ్స్ క్రికెట్ ఈవెంట్ కు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. అక్కడ క్రికెటర్ల కోసం చేసిన ఏర్పాట్లు, హోటల్ వసతులపై బీసీసీఐతో పాటు ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ)లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. పరిస్థితులను సమీక్షించడానికి ఒక అబ్జర్వర్‌ను జపాన్ కు పంపాలని బోర్డు భావిస్తోంది. ఒకవేళ వసతులు ఏమాత్రం సరిగ్గా లేవని తేలితే ప్రధాన జట్టుకు బదులుగా 'బి' టీమ్ ను అక్కడికి పంపే అంశాన్ని బోర్డు పరిశీలిస్తోందని తెలుస్తోంది. జపాన్ లో క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలపై బీసీసీఐ వర్గాలు అన్ హేపీగా ఉన్నాయి. "ఏసీసీ సమావేశంలో జపాన్ ఒలింపిక్స్ నిర్వాహకులకు మా అభ్యంతరాలను తెలిపాం. క్రికెటర్ల కోసం డ్రెస్సింగ్ రూమ్ లను టెంట్లలో ఏర్పాటు చేశారు. పైగా వాష్ రూమ్స్ ఆ టెంట్ల నుంచి దాదాపు 500 మీటర్ల దూరంలో ఉన్నాయి. ఆటగాళ్లకు కేటాయించిన హోటల్ గదులు కూడా చాలా చిన్నవిగా ఉన్నాయి" అని బోర్డు ప్రతినిధి తెలిపాడు. అబ్జర్వర్ ఇచ్చే గ్రౌండ్ రిపోర్ట్ ఆధారంగా తుది నిర్ణయం తీసుకోనున్నారు. మహిళల క్రికెట్ ఈవెంట్ సెప్టెంబర్ 17 నుంచి 22 వరకు, పురుషుల విభాగం మ్యాచ్ లు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 3 వరకు నిర్వహిస్తారు. చైనాలో చివరిసారిగా జరిగిన ఏషియన్ గేమ్స్ లో గోల్డ్ మెడల్ గెలిచిన ఇండియా, ఈసారి కూడా టైటిల్ నిలబెట్టుకోవడానికి శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో బలమైన స్క్వాడ్ ను ప్రకటించింది. ఈ జట్టులో వైస్ కెప్టెన్ గా తిలక్ వర్మ ఉండగా, సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, వైభవ్ సూర్యవంశీ, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, స్టార్ పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్ ఆడతారు. మహిళల విభాగానికి కెప్టెన్ గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ గా స్మృతి మంధాన వ్యవహరిస్తున్నారు.

# టీమిండియాపై మహమ్మద్ కైఫ్ ఆగ్రహం



శ్రీలంకతో రెండో టెస్ట్‌ను డ్రా చేసుకున్న టీమిండియాపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. భారత్ విజయానికి అడ్డుగా నిలిచిన సోనాల్ దినుషా బలహీనతను పసిగట్టడంలో జట్టు మొత్తం విఫలమైందని మండిపడ్డాడు. ఇదేం కబ్ల్ మ్యాచ్ కాదని, డేటా అనలిస్ట్, కోచ్‌లు ఏ చేస్తున్నారని ప్రశ్నించాడు. సోనాల్ దినుషాను ఔట్ చేసే విషయంలో కోచ్‌గా గంభీర్.. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ విఫలమయ్యారని అభిప్రాయపడ్డాడు. కొలంబో వేదికగా గురువారం ముగిసిన రెండో టెస్ట్‌లో సోనాల్ దినుషా అజేయ శతకంతో శ్రీలంక ఓటమి నుంచి గట్టెక్కింది. మరోవైపు సునాయసంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌ను భారత్ చేజేతులా చేజార్చుకుంది. ఆఖరి రోజు ఆటలో నలుగురు బ్యాటర్లను ఔట్ చేయలేక మూల్యం చెల్లించుకుంది. ఈ మ్యాచ్ ఫలితంపై అధికారిక బ్రాడ్‌కాస్టర్ సోనీ టీవీ షోలో మాట్లాడిన కైఫ్.. గిల్‌సేనపై ఘాటు విమర్శలు చేశాడు. 'ప్రతీ బ్యాటర్‌కు ఏదో ఒక లోపం ఉంటుంది. ఆ లోపాన్ని కనుగొనడంలో భారత్ విఫలమైంది. నేను కేవలం శుభ్‌మన్ గిల్‌ను మాత్రమే నిందించడం లేదు. సోనాల్ దినుషా బలహీనతను పసిగట్టడంలో బౌలింగ్ విభాగంతో పాటు కోచింగ్ సిబ్బంది దారుణంగా విఫలమైంది. అతను గాలే టెస్ట్‌లోనే సెంచరీ చేశాడు. కాబట్టి అతన్ని ఔట్ చేసేందుకు పకడ్బందీ ప్రణాళికల గురించి చర్చ చేయాలి కదా? ఈ టెస్ట్‌లో వ్యూహాత్మకంగా టీమిండియా బలహీనంగా కనిపించింది. అటాకింగ్ ఫీల్డ్ సెటప్ చేయలేదు. ఫీల్డింగ్‌ను ఓపెన్‌గా పెట్టారు. ఒక్క డ్రైవ్ షాట్ బాల్ కూడా వేయలేదు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ తర్వాత డ్రైవ్ బాల్‌తోనే సోనాల్ దినూషాను సారాన్ష్ జైన్ ఔట్ చేశాడు. కానీ ఈ విషయాన్ని భారత బౌలర్లు మరిచిపోయారు. మహమ్మద్ సిరాజ్ ఫుల్ బాల్ వేసినా అతను తెలివిగా వదిలేసాడు. అతను షాట్లు ఆడటానికి ఏ మాత్రం ఇష్టపడలేదు. ఇక ఇదేం క్లబ్ మ్యాచ్ కాదు. ఇంటర్నేషనల్ గేమ్. జట్టులో ఒక వీడియో అనలిస్ట్, డేటా ఎక్స్‌పర్ట్, ఆరు నుంచి ఏడుగురు కోచ్‌లు ఉన్నారు. సోనాల్ దినూషాను ఔట్ చేసే ప్రణాళికలు రచించకుండా వీరంతా ఏం చేస్తున్నారు.. భారత యువ బౌలర్లకు ఇలాంటి పిచ్‌పై ఆడిన అనుభవం లేదు. టెస్ట్‌ల్లో వారు ఐదో రోజు ఎక్కువగా బౌలింగ్ చేయలేదు. ఎందుకంటే టెస్ట్ మ్యాచ్‌లు ఇంత సుదీర్ఘంగా ఎక్కువగా జరగవు. దాంతోనే ఏం చేయాలో భారత బౌలర్లకు అర్థం కాలేదు. అంతేకాకుండా సోనాల్ దినుషాను భారత జట్టు పెద్దగా పట్టించుకోలేదనే విషయం అర్థమవుతుంది.

రెండో మ్యాచ్‌లోనూ అదే పొరపాటు చేశారు. రెండో టెస్ట్‌లో అతను ఒక్క కవర్ డ్రైవ్ బౌండరీ సాధించలేదు. పుల్, స్వీప్, రివర్స్ స్వీప్ షాట్స్ మాత్రమే ఆడాడు.

కానీ ఒక్క కవర్ డ్రైవ్ షాట్ ఆడలేదు. అతను ఆ షాట్ ఆడేలా భారత బౌలర్లు కూడా బంతులు వేయలేదు. షార్ట్ పిచ్ బాల్స్ వేసి పరుగులు సమర్పించుకున్నారు.'అని మహమ్మద్ కైఫ్ అసహనం వ్యక్తం చేశాడు.

# దూసుకుపోతున్న ఇరుముడి

## గ్రామీణ ప్రాంతాల్లో భారీగా టిక్కెట్ల అమ్మకం




మాస్ మహారాజా రవితేజ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతూ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. విడుదలైనప్పటి నుంచి వరుసగా రికార్డులు సృష్టిస్తున్న ఈ చిత్రం తాజాగా ఆన్‌లైన్ టికెట్ విక్రయాల్లో సరికొత్త మైలురాయిని చేరుకుంది. ప్రముఖ టికెటింగ్ ఎ÷–లాట్‌ఫార్మ్‌లైన బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్స ద్వారానే 'ఇరుముడి'కి 55 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. ఒక ప్రాంతీయ చిత్రానికి ఈ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.రవితేజ మాస్ అప్పీల్, ఎమోషనల్ డ్రామా, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుండటంతో థియేటర్లలో ప్రేక్షకుల రద్దీ కొనసాగుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మాస్ ప్రేక్షకుల వరకు అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో సినిమా కలెక్షన్ల పరంగా కూడా దూసుకుపోతోంది. బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఇరుముడి' ఇప్పుడు టికెట్ విక్రయాల్లోనూ తన సత్తా చాటుతూ కొత్త రికార్డులను లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం చిత్రానికి ఉన్న జోరు చూస్తుంటే రాబోయే రోజుల్లో మరిన్ని మైలురాళ్లు అందుకోవడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.



# 'మహిళలను ఇలా చూపిస్తారా'..

## 'టాక్సిక్'పై అన్నామలై ఫైర్

యశ్ నటించిన 'టాక్సిక్' సినిమాలో మహిళలను అతిగా లైంగికంగా చూపించారని బీజేపీ మాజీ నేత కె. అన్నామలై తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి చిత్రాలకు 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' (సీబీఎఫ్‌సీ) ఎలా అనుమతి ఇచ్చిందని ప్రశ్నించారు. సినిమాల్లో చూపించే సన్నివేశాల విషయంలో సెన్సార్ నిబంధనలను మరింత కఠినతరం చేయాలని అన్నారు. మహిళలను ఒకే కోణంలో చూపించే సినిమాలు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నామలై ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల భద్రతపై సమాజంలో అవగాహన కల్పిస్తున్న సమయంలో ఇలాంటి చిత్రాలకు అనుమతి ఇవ్వడం సరికాదన్నారు. మహిళలకు సంబంధించిన అంశాలపై జరుగుతున్న కృషిని ఇలాంటి సినిమాల చిత్రీకరణ దెబ్బతీస్తుందని వ్యాఖ్యానించారు. 'టాక్సిక్' విడుదలైన తొలి రోజే రూ.104 కోట్ల వసూళ్లు సాధించిందని అన్నామలై పేర్కొన్నారు. పెద్ద హీరోలు నటించిన సినిమాల విషయంలోనూ సెన్సార్ బోర్డు గట్టి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కాగా, సినిమాపై వస్తున్న విమర్శలను హీరో యశ్ తిప్పికొట్టారు. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌ను సమర్థించారు. ట్రైలర్ చూసి సినిమాపై అభిప్రాయానికి రావద్దని కోరారు. సినిమాలో మహిళలకు బలమైన గొంతు ఉందని చెప్పారు. అమ్మాయిలు థియేటర్లకు వెళ్లి సినిమా చూడాలని పిలుపునిచ్చారు. 'టాక్సిక్' గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో తెరకెక్కింది. యశ్ ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రంలో నయనతార, తారా సుతారియా, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషీ, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో నటించారు

# నేడు కింగ్ 100 టైటిల్ గ్లింప్స్ విడుదలకు సిద్ధం



టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆయన కెరీర్‌లో వందో మైలురాయిగా నిలుస్తున్న ప్రతిష్టాత్మక 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. యువ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఈ చిత్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. నాగార్జున పుట్టినరోజు కానుకగా ఆగస్టు 29 ఉదయం 9 గంటలకు 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఫాస్టెన్ యువర్ సీట్‌బెల్ట్స్ రేపటి నుంచి కింగ్ ఆధిపత్యం మొదలవ్వబోతోంది అంటూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పంచుకున్న ఈ అనౌన్స్‌మెంట్ ప్రస్తుతం అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.



# శర్వానంద్ 'భోగి'లో ఐదుగురు అక్కాచెల్లెళ్లు..

## రాఖీ రోజున సర్‌ప్రైజ్ ఇచ్చిన డైరెక్టర్!

శర్వానంద్ హీరోగా దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోగి'పై ఆసక్తి మరింత పెరుగుతోంది. రాఖీ పండుగ సందర్భంగా సినిమాలో శర్వానంద్ పోషిస్తున్న గంగ పాత్రకు ఐదుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారని దర్శకుడు వెల్లడించారు. ఐదుగురు సోదరీమణులతో గంగ ఉన్న పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసిన సంపత్ నంది.. వారిని 'భోగి'కి ఆత్మలాంటి పాత్రలుగా అభివర్ణించారు. "ఫైవ్ సిస్టర్స్.. వన్ వరల్డ్.. వన్ హార్ట్‌బీట్" అంటూ రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవలే సినిమాకు మరో కొత్త పాటను రికార్డ్ చేసినట్లు సంపత్ నంది వెల్లడించారు. ఆస్కార్ అవార్డు విజేత చంద్రబోస్ సాహిత్యం, భీమ్స్ సిసిరోలియో సంగీతంతో రూపొందిన ఈ పాటను 'టైమ్‌లెస్ జెమ్'గా దర్శకుడు పేర్కొన్నారు. 'భోగి' కోసం ఇప్పటికే భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. జులైలో 22 రోజుల పాటు వరుసగా క్లైమాక్స్ షూటింగ్ నిర్వహించారు. భారీ సెట్‌లో చిత్రీకరించిన ఈ సన్నివేశంలో 800 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నట్లు చిత్రబృందం తెలిపింది. యాక్షన్ కొరియోగ్రఫీని దిలీప్ సుబ్బరాయన్ రూపొందించారు. గంగ పాత్ర కోసం శర్వానంద్ రోజూ రెండున్నర గంటలకు పైగా మేకప్ వేసుకోవడంతో పాటు, షూటింగ్ పూర్తయ్యాక దాదాపు గంట సమయం మేకప్ తొలగించుకోవడానికి పట్టేదని సమాచారం. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. అనుపమ.. కందుల సులోచన రాణి పాత్రలో, డింపుల్.. మందారం పాత్రలో కనిపించనున్నారు.

# 18న వస్తోన్న అనుమాన పక్షి




డిజె టిల్లు'తో సెన్సేషనల్ డెబ్యూను అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ రెండో సినిమా 'అనుమాన పక్షి'. రాగ్ మయూర్ హీరోగా ఈ సినిమాను రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మించారు. తొలి చిత్రం తరహాలోనే ఈ సినిమానూ యునిక్ కామెడీ ఎంటర్ టైనర్ గా విమల్ కృష్ణ తెరకెక్కించారు.తమ 'అనుమాన పక్షి' చిత్రం సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల తేదీని తెలియజేస్తూ ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమా విభిన్నమైన టోన్‌తో పాటు హీరో విచిత్రమైన ఆలోచనా విధానాన్ని ఈ పోస్టర్ ప్రజెంట్ చేస్తోంది. రాగ్ మయూర్ సంప్రదాయ దుస్తుల్లో చేతిలో రైఫిల్ పట్టుకుని కనిపిస్తున్నారు. ఆయన పక్కనే ఉన్న బ్లాక్‌బోర్డుపై 'డౌట్స్ అండర్ ఇన్వెస్టిగేషన్' అనే టైటిల్‌తో జీవితం, విధి, కర్మ, దేవుడి ఎ÷–లానింగ్స్ కు సంబంధించిన ఆసక్తికరమైన ప్రశ్నలను పొందుపరిచారు. 'ఒన్ బోయ్. బిలియన్ థాట్స్, జీరో చిల్' అనే ట్యాగ్‌లైన్ ఆయన పాత్రలోని ఆలోచనా విధానాన్ని మరింత ఆసక్తికరంగా తెలియజేస్తోంది.

-------

# మిత్రుడు నారాయణరావు పార్థివదేహానికి నివాళి అర్పించిన చిరంజీవి..



రచయిత, నటుడు, తన మిత్రుడు జీవీ నారాయణరావు భౌతికకాయానికి మెగాస్టార్ చిరంజీవి నివాళులర్పించారు. ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించిన చిరంజీవి... అనంతరం నారాయణరావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. తన ఆప్తమిత్రుడితో ఉన్న దశాబ్దాల సుదీర్ఘ అనుబంధాన్ని, చివరి జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. 1977 నుంచి తమ ఇద్దరి మధ్య పరిచయం ఉందని, ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న సమయంలో నారాయణరావు తమకు సీనియర్ విద్యార్థిగా ఉండే వారని చిరంజీవి తెలిపారు. అప్పట్లోనే ఆయన తన నటనా అనుభవాలను తమతో పంచుకుంటూ ఎంతో చొరవగా ఉండేవారని చెప్పారు. ఆ తర్వాత ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఎవరి సినిమాల్లో వారు బిజీ అయిపోయామని తెలిపారు. తన కొన్ని చిత్రాల్లోనూ నారాయణరావు కీలక పాత్రలు పోషించారని గుర్తుచేశారు. ఆ తర్వాత వ్యక్తిగత, వృత్తిపరమైన బాధ్యతల వల్ల ఇద్దరి మధ్య కొంత గ్యాప్ వచ్చినట్లు పేర్కొన్నారు.

నారాయణరావుతో తనకు జరిగిన చివరి కలయిక గురించి చెబుతూ చిరంజీవి మరింత భావోద్వేగానికి గురయ్యారు. కేవలం పది రోజుల క్రితమే తాము నటించిన 'మంచుపల్లకి' చిత్రాన్ని మళ్లీ చూశానని తెలిపారు. ఆ సినిమా స్ఫూర్తితోనే ఐదుగురు కొత్తవారితో ఒక కొత్త కథను రాసుకున్నానని నారాయణరావు తనతో చెప్పారని వెల్లడించారు.



# అమ్మానాన్నల కష్టం చూశా.. అందుకే సినిమాల్లోకి : అనంతిక

'మ్యాడ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమై, '8 వసంతాలు' సినిమాతో యువతకు మరింత చేరువైన నటి అనంతిక సనిల్‌కుమార్. ప్రస్తుతం ఆమె నటించిన 'రోమాంచకం' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 3న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా అనంతిక తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన కుటుంబ నేపథ్యం, కెరీర్‌లో ఎదుర్కొన్న సవాళ్ల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

చిన్నప్పటి నుంచి తనకు కళలంటే ఎంతో ఇష్టమని, ఆరో తరగతి నుంచే నృత్య ప్రదర్శనల్లో పాల్గొనేదాన్నని అనంతిక తెలిపారు. "ఒక ప్రదర్శన ఇవ్వాలంటే ఎంతో ఖర్చయ్యేది. మా కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, అమ్మానాన్నలు నన్ను ఎప్పుడూ నిరుత్సాహపరచలేదు. అప్పులు చేసి మరీ నన్ను ఈవెంట్లకు పంపించేవారు. ఆ కష్టాలను నేను ప్రత్యక్షంగా చూశాను, ఆ బాధేంటో నాకు తెలుసు. వారిని గొప్పగా చూసుకోవాలనే లక్ష్యంతోనే చిత్ర పరిశ్రమలోకి వచ్చాను" అని ఆమె వివరించారు.

కెరీర్ ప్రారంభంలో తన రూపం కారణంగా కొన్ని భారీ ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చిందని అనంతిక పేర్కొన్నారు. "ఫొటోలు చూసి చిన్నపిల్లలా కనిపిస్తున్నావంటూ తిరస్కరించేవారు. నా లుక్స్ వల్లే నాని గారి 'ది ప్యారడైజ్' సినిమాలో అవకాశం కోల్పోయాను. అవకాశాలు చేజారినప్పుడు బాధ కలిగినా, ఏది జరిగినా సానుకూలంగా ముందుకు సాగడమే నా నైజం. 'రోమాంచకం' తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. మనకు రాసిపెట్టింది ఖచ్చితంగా దక్కుతుంది" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# రేస్-4 కు అమీర్ గ్రీన్ సిగ్నల్



బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ చాలా రోజుల తర్వాత కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రముఖ యాక్షన్ ఫ్రాంచైజీ 'రేస్' నాలుగో భాగంలో ఆయన నటించనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 'రేస్ 4' స్క్రిప్ట్ ఆమిర్ ఖాన్‌కు బాగా నచ్చడంతో ఆయన ఈ ప్రాజెక్ట్‌ను చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ఈ చిత్రానికి దర్శకత్వం వహించే బాధ్యతలను ప్రముఖ దర్శకుడు విజయ్ కృష్ణ ఆచార్యకు అప్పగించినట్లు సమాచారం. గతంలో ఆమిర్ ఖాన్, విజయ్ కృష్ణ ఆచర్య కాంబినేషన్‌లో వచ్చిన 'ధూమ్ 3' సినిమా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను విజయ్‌కి ఇవ్వబోతున్నట్లు సమాచారం. కాగా.. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

--------

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888